J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 నెల్లూరు, 02.10.2020, శుక్రవారం సంపుటి : 40 సంచిక : 18 పేజీలు : 16, వెల : ₹ 5

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerpatrika.com

లాయర్

## ప్రతి అక్షరం.. బాలు కోసం!

**పా**టలు - మాటలే ఉచ్ఛ్వాస నిశ్వాసలుగా జీవితం సాగించి, అద్వితీయమైన తన గంధర్వగానంతో ఆబాలగోపాలాన్ని అలరించి మన నెల్లూరు కీర్తిపతాకను ప్రపంచవ్యాప్తంగా రెపరెపలాడించిన మన బాలు సెప్టెంబరు 25న అస్తమించడంతో భారతీయ సినిమా రంగానికి, ప్రత్యేకించి తెలుగు చలనచిత్ర పరిశ్రమకు చీకట్లు కమ్మినట్లయింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాదిమంది సంగీతాభిమానులు ఇక బాలు లేరనే తీరని ఆవేదనతో కన్నీరుమున్నీరయ్యారు.

అయినా విధి ఎంత కర్కశమైనదో! బాలును మనకు కాకుండా మనకిక లేకుండా చేసింది. అయితే దానికేం తెలుసు.. బాలు అందరి గుండెల్లో నిక్షేపంగా ఉన్నాడని!... భారతీయ సినిమా ప్రపంచ సంగీతం ఉనికి ఉన్నంతవరకూ సంగీతాభిమానుల మనసుల్లో సజీవంగానే ఉంటాడని.

నెల్లూరును మరో తిరువయ్యార్‌గా ప్రఖ్యాతిలోకి తెచ్చిన భగవదారాధకుడు.. ప్రఖ్యాతి హరికథా గాన కళాకోవిదుడైన శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి-శకుంతలమ్మ గార్లకు వరపుత్రునిగా జన్మించిన బాలు.. తండ్రిగారి గానాన్ని - తల్లి గారి వినయాన్ని పుణికి పుచ్చుకుని వారి స్ఫూర్తి దీప్తులతో సంగీతరంగంలో శిఖరాయమానంగా వెలుగొందారు.


మధురాతిమధురమైన తన గాత్రంతో పాటకు స్వర పుష్పాభిషేకం చేసి, తెలుగునాటనే కాకుండా ప్రపంచం నలుమూలలా తెలుగు మాటకు.. తెలుగు పాటకు పట్టాభిషేకం చేసి కోట్లాదిమంది ప్రజలను ఉర్రూతలూగించిన స్వరబ్రహ్మ ఆయన. బహుముఖ ప్రజ్ఞాశాలిగా ప్రపంచమే కొనియాడే ఒక గొప్ప సంగీతవేత్తగా అజరామరమైన కీర్తిచంద్రికలతో విలసిల్లిన అంతటి మహాగాయకుడు భారతావనికే ఒక గొప్ప వరం!...

ప్రత్యేకించి 'లాయర్' కుటుంబంతో బాలుకు ఉన్న ఆత్మీయానుబంధం మాటల్లో చెప్పలేనంతటి మహనీయమైనది.

బాలు కోసం కోట్లాదిమంది అభిమానులు ఆర్తితో ఆవేదన చెందుతున్న ఈ తరుణంలో..మన నెల్లూరీయుడు.. మన ఆనందం కోసం పరితపించిన మహానుభావుడు.. మన బాలుకు... ఇదిగో!... కన్నీటితో అర్పిస్తున్న నివాళిగా..'లాయర్' ఈ వారం 'ప్రతి అక్షరం బాలు కోసమే' అంటూ మీ ముందుకు వచ్చింది. అందుకే ఈ సంచికలో ప్రతివారం వస్తున్నట్లుగా వార్తలు.. ఇతరత్రా కథనాలు వగైరాలేమీ లేవు. ప్రతి అక్షరం సంగీత"మణి"కే అంకితం.

మాటలు రాని..ఈ మౌనవేదనలో.. మా హృదయం పలికిన ఈ నాలుగు మాటలు.. బాలుకి మా అక్షర నీరాజనాలు!

సం/-



**భా**రతీయ సినిమా సంగీతం మూగబోయింది. వెండితెరపై నిశ్శబ్దం ఆవరించింది. సంగీతమంటే చెవి కోసుకునే ప్రతి అభిమాని గుండె చెరువైంది. ఆబాలగోపాలాన్ని తన పాటలతో, మాటలతో అలరించి మురిపించి మెప్పించి మైమరపించిన శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం మధురస్వరం అలసి సొలసి మౌనం దాల్చింది. మధుర గాయకునిగానే కాక, సంగీత దర్శకునిగా, నటునిగా, ఎందరో మహానటులకు గాత్రదానం చేసిన విలక్షణ వ్యక్తిగా, ప్రపంచవ్యాప్తంగా వేలాదిమంది వర్ధమాన గాయనీగాయకులకు సంగీతంలో ఉత్సాహప్రోత్సాహాల నిచ్చిన గురువుగా బాలు ఖ్యాతి దశదిశలా మారుమ్రోగింది. అనితరసాధ్యమైన రీతిలో ఆయన సాగించిన పాటల ప్రస్థానం అసామాన్యమైనది. తరతరాలకి తరగని పాటలిచ్చిన ఆ గంధర్వగానం కనుమరుగైంది.

## తరతరాలకి తరగని పాటలిచ్చి..

# మూగబోయిన గంధర్వగానం





"సంగీతం భగవంతుడు మాట్లాడే భాష. భగవంతుడ్ని చేరుకోవడానికి అతి దగ్గరి దారి సంగీతారాధన. ఆ భగవంతుడు గుళ్ళలో ఉన్నాడో లేదో తెలియదు కానీ.. ఎక్కడైతే శృతిపక్వంగా భావగర్భితంగా సంకీర్తన జరుగుతుందో అక్కడ మాత్రం ఆ భగవంతుడు ఉండి తీరుతాడు.

బాలు మాట... బంగారు బాట

# ఆబాలగోపాలానికి ఆరాధ్యుడైన బాలు



*ఒక కళాకారుడు తన రంగంలోని యితర కళాకారుల్ని పెంచిపోషించడం అరుదైన విశిష్ట లక్షణం. తాను గాయకుడిగా వుండి తనంతటి గాయకులను, తనకుమించిన గాయకులను తయారు చేయాలన్న తపన గలిగినవాడు మన బాలు. 'పాడుతా తీయగా' కార్యక్రమం ద్వారా ఔత్సాహిక గాయకులకు ప్రోత్సాహమిచ్చి వారి గాత్రానికి అవసరమైన మెళకువలను తెలియబరిచి, వారి గానంలోని గమకాలకు మెరుగులు దిద్ది, రేపటి గాయకులకు పటిష్టమైన పునాదివేసిన ఆచార్యవర్యుడు మన బాలు.*

*'పాడుతా తీయగా' 'పాట'శాల ద్వారా ఎన్ని క్రొత్త లేత గొంతుకలు పురుడు పోసుకున్నాయో! నిజ జీవితంలో ఒక కళలో వైభవంగా వెలిగే వ్యక్తులు జీవితాంతం అందులోనే తలమునకలై వుంటారు. ఆ కళలో జరుగుతున్న కృషినీ వెలుగుతున్న జ్యోతులనూ అంతగా పట్టించుకోరు. అయితే సంగీత ప్రపంచంలో ధృవతారగా వెలిగిన బాలుగారు, సినీ సంగీత ప్రపంచంలో యింత వరకూ ఏ గాయకుడూ, ఏ గాయనీమణి తలపెట్టని సౌజన్యవంతమైన కార్యక్రమం నిర్వహించి 'ఆచార్య' స్థానం పొందినవాడు ఒక్క బాలూనే!*

ప్రతిభ, వినయం, సంయమనాల మేలుకలయిక మన బాలు. మానవీయత, సామాజిక స్పృహ, బాధ్యత ఎరిగి తన వంతు సత్కర్మలు చేసిన కర్మజీవి మన బాలు.

బాలు పాటలెంత మధురమో మాటలు అంతకన్న మార్దవంగా, అర్ధవంతంగా, ఆర్ద్రభరితంగా వుంటాయి. పాటలు ఏ కవి వ్రాసినవో కావచ్చు, కానీ మాటలు ఆయన హృదయ కుహరాల్లోంచి వచ్చినవేకదా!

ఆయనకున్న స్నేహబృందం ఆయన చల్లని, తియ్యని మాటలనే అమృతంగా సేవించి తరించారు– అందులోని మాధుర్యం, అమృతత్వం నేనూ అనుభవించిన వాడిని గావటం నా అదృష్టం.

పాటల విశ్వరూపం – మాటల ప్రేమస్వరూపం ఒక్కటిగా తనలో నిలుపుకొన్న గొప్ప నిత్యసాధకుడు మన బాలు. అన్ని భావాలను తన గళంలో స్వచ్ఛంగా, నిర్దుష్టంగా పలికించగలిగిన అనన్య సామన్య ప్రతిభ ఆయనది.

అన్ని రసాలను దృశ్యమానం చేయగల చేవవున్న మహానటుడు కూడా ఆయన. నటించినవి కేవలం వేళ్ళమీద లెక్కపెట్టగలిగినవి అయినా, ఏ అగ్ర నటులకూ తీసిపోని నటనా ప్రతిభను ప్రస్ఫుటంగా తెరమీద వెలిగింపచేసిన సమర్ధుడు మన బాలు. అందుకు నిదర్శనం 'మిథునం' చిత్రం. ఆయన 40వేల పైచిలుకు పాటల ద్వారా చిరంజీవిగా అందరి హృదయాల్లో మరో నూరేళ్ళు చిరస్థాయిగా నిలిచిపోతాడు.

ఆయన వ్యక్తిత్వం, సౌజన్యం, సంస్కారం తెలిసిన నాబోటి వారికి, మా జన్మలున్నంతవరకూ మా హృదయాల్లో సందీప్తంగా వెలుగుతూనే వుంటాడు. ఆయన సంస్కార సౌరభాలను, ఆయన చేసిన సత్కార్యాలను అక్షరీకరించి ఆయన విశ్వరూపాన్ని ముందు తరాల వారికి దర్శింపచేయాలన్నది నా ప్రగాఢమైన సంకల్పం. యుగానికొక్కరు యిలా కారణజన్ముడిగా ఈ భూమ్మీదకు వస్తారు. అలాంటి వారు శ్రీ పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యంగారు.

ఆయన

గాయకుడిగా – గాంధర్వుడు

మనిషిగా – మహోన్నతుడు

సంస్కారిగా – మాననీయుడు

స్నేహితుడిగా – శ్రీకృష్ణుడు

నేను వారి స్నేహితుడిని కావడం నా పూర్వ జన్మ పుణ్య ఫలం!

నేను, వారు, సంవత్సరంలో కనీసం ఏడెనిమిది మార్లు కలిసేవాళ్ళం. మా యింటికి వచ్చిన ప్రతిసారీ ఎన్నో విషయాలు, ఎందరెందరి గురించో ప్రశంసాపూర్వకంగా, ఆత్మీయంగా ముచ్చటగా చెప్పేవారు. ప్రతి ఒక్కరిలోని ప్రతిభనూ, మంచినీ గ్రహించి, దాన్ని ఉద్దీప్తంచేస్తూ మాట్లాడేవారు. అది ఆయన సంస్కారం. అలా ఇష్టాగోష్టిలో ఎందరెందరో మహానుభావుల ప్రస్తావనలు వచ్చేవి. ఆయనతో చివరిసారిగా నేను గడిపినది మా యింట్లో జనవరి 30, 2020న. ఆయన మా యింటికి వచ్చారు. డాక్టరు మధు, శిరీష దంపతులు న్యూయార్కు నుంచి హైదరాబాద్‌కు వచ్చి, ఆయనను కలవడానికిగా మా యింటికి వచ్చారు. మా అల్లుడు గౌతమ్, ఆయన స్నేహితుడు నాని కూడా మాతో కలిసి కూర్చున్నారు. ఓ మూడు గంటల మాటామంతీ, మధ్యమధ్యలో పాట, పాట వెనుక కథా కమామీషు, ఆ పాటలకు ప్రాణంపోసిన వారి గురించిన ముచ్చట్లు, అచ్చట్లు.

ముఖ్యంగా బాపు–రమణలు ఎక్కువగా మా చర్చల్లోకి వస్తుండేవారు. బాపుగారి అమాయకత్వం, బాపుగారి తాటాకు మంటంత కోపం, రమణగారి పరిణతత్వం చాలా గొప్పగా చెప్పేవారు. బాపుగారి చివరిరోజుల్లో వారిని చూడటానికి నేను మద్రాసు వెళ్ళినప్పుడు యాదృచ్ఛికంగా బాపుగారిని తానే స్వయంగా హాస్పిటల్‌కి తీసుకెళ్ళుతున్నట్లుగా తెలిసి, నేను వారితో కలిసి వెళ్ళాను. ముగ్గురం హాస్పిటల్‌కి వెళ్ళినప్పుడు ఆ డాక్టర్లతో బాపుగారు పడే చికాకు, ఆ చికాకును సముదాయించే బాలుగారి సహనం, ఓర్పు, నా కళ్ళరా చూశాను. బాపుగారు చాలా మొండికేసేవారు. డాక్టర్‌తో సహకరించేవారు కాదు. "నాకు ఈ వైద్యం వద్దు, వాళ్ళు టైంకు నన్ను చూడటం లేదు. వాళ్ళకు నా జబ్బు అర్థం కావట్లేదు" అంటూ శషభిషలు పోయేవారు. బాలుగారు ఎంతో ఓపికగా, ఎంతో సంయమనంగా "అలా కాదు బాపుగారూ. ఇలాండీ! అలాకాదండీ! నా మాట వినండి, నన్ను నమ్మండి" అంటూ పసిబిడ్డను బుజ్జగించినట్లుగా బాపుగారికి వైద్యం చేయించటం నా కళ్ళారా చూసిన సత్యం. ఆయనకు అంత ఓపిక, సంయమనం, బాపుగారి పట్ల, బాపుగారి లాంటి అనేకమంది విజ్ఞుల పట్ల ఆయన భక్తి, శ్రద్ధ అలాంటివి. ఆయనున్న స్థాయికి బాపుగారి సహాయార్థం, తన అసిస్టెంట్‌నో, మేనేజర్‌నో పంపించివుండవచ్చు. కానీ, తానే స్వయంగా వచ్చి ఆసుపత్రికి తీసుకెళ్ళడం బాపు గారితో పాటు వైద్యుల దగ్గర కుర్చోవడం, బాపుగారి తరపున తానే మాట్లాడడం, బాపుగారు ఆ ఇంజెక్షన్లకు మొరాయిస్తే అనునయంగా బుజ్జగించి బాపుగారికి ఆ వైద్యం అందేట్లుగా చూడడం, అదొక నేత్రపర్వం!

మా పూజ్యగురువులు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర రావు గారు గోశాలలో సందర్శకులు విని ఆనందించేందుకు వీలుగా జాషువా రచించిన గోవు మీద పద్యాలను, స్కాంద పురాణాంతర్గత గోసూక్తం, భారతంలోని అనుశాసనిక పర్వంలో గోవు మీదున్న కొన్ని పద్యాలను సేకరించి మాకిచ్చి, వాటిని సంగీత బద్ధంచేయించి, గాయకుల చేత పాడించి రికార్డు చేయమన్నారు. వాటితో పాటు తెలుగు చలనచిత్రాలలో గోవు మీద వచ్చిన కొన్నిపాటలు సేకరించి ఒక మ్యూజికల్ ఆల్బమ్‌గా గురువుగారికి సమర్పించాము. ఇందులో జాషువా గారి కొన్ని పద్యాలు బాలు గారే స్వయంగా స్వరపరిచి, పాడి, 17.03.2020న మాకందించారు. బహుశా నాకున్న సమాచారం ప్రకారం తెలుగులో చివరగా ఆయన సంగీతబద్ధం చేసి, పాడినది ఈ జాషువా పద్యాలే అనుకుంటాను.



వరప్రసాద్‌రెడ్డి కుటుంబసభ్యులతో బాలు దంపతులు

అదేవిధంగా సంగీతప్రపంచంలో ఆయన నిత్యం తలవని వారుండరు. లబ్దప్రతిష్టులైన అందరు సంగీత దర్శకులు కోదండపాణిగారు మొదలు మహాదేవన్, రాజేశ్వరరావు, పెండ్యాల, ఘంటసాల, సత్యం, ఆదినారాయణరావు, ఇళయరాజా, మాస్టర్‌వేణు, అశ్వద్ధామ, ఎ.ఆర్.రెహమన్, మాధవపెద్ది సురేష్, కీరవాణి, మణిశర్మ, తమన్, దేవిశ్రీప్రసాద్ ఇలా చెప్పుకుంటూ పోతే ఎందరో, అందరిగురించి ప్రతి ఒక్కరి గురించి వాళ్ళ వాళ్ళకు వున్నటువంటి ప్రతిభా విశేషాలు ఉదాహరణలతో సహా గొప్పగా చెప్పేవారు.

సాహితీరంగంలో సినారె, ఆత్రేయ, ఆరుద్ర, దాశరథి, వేటూరి, సిరివెన్నెల, జొన్నవిత్తుల, రామజోగయ్య శాస్త్రి, వెన్నెలకంటి, రాజశ్రీ, అనంత్‌శ్రీరామ్, చంద్రబోస్... ఇలా ఎందరో కవుల పేర్లు వాళ్ళు వ్రాసిన గీతాలలోని కొన్ని పదాలను ఉటంకిస్తూ, మురిసిపోయి చెప్పేవారు. ఇలా మనకు తెలిసిన పేర్లే కాదు, ఆర్కెస్ట్రాలో మనకు ఎవరికీ తెలియని పేర్లు, ఎవరో చిన్న వాద్యకారుడి గురించి కూడా వారి పేరు చెప్పి, అతను ఎంత అద్భుతంగా ఏ పాటలో, ఏ బిట్టు ఎలా వాయించాడో, ఏ రకంగా ఆ పాటకు సొంపు, ఇంపు కలిగించాడో గుర్తుపెట్టుకొని మనసారా పొగుడుతూ చెప్పి మురిసిపోయేవారు. అదీ ఆయన సంస్కారం, ఆయన సౌభ్రాతృత్వం. ఒక పాట చిరకాలం మనసులో మెదలలాంటే కేవలం తన గాత్రమే కాదని, ఆ పాట రూపకల్పనలో ఎందరిదో కృషి వుందని పేరుపేరునా అందరి పేర్లు చెప్పి, వారందరి సమిష్టి కృషి కారణంగానే ఆ పాటకు అంత విలువ వచ్చిందని చెప్పుకునేవారు. ఇది చాలా అరుదైనటువంటి లక్షణం. ఆయన నమ్మిన మంచిని పదిమందికి తన అందమైన మాటలతో పంచారు.

**యశ:శరీరం కలిగిన మహానుభావుడికి జరామరణాలుండవంటారు...**

**పునరావృత్తిలేని స్థితిని పొందిన ఆయన నిజంగా చరితార్థుడు.**

మా హృదయాలలో, మా అంతరంగాలలో, అజరామరమైన మిమ్మల్ని ఏ మృత్యువూ మా నుంచి వేరు చేయలేదు. మీ పాట, మీ మాటా, మీ హృదయం, మీ స్నేహం, మీ ఆదర్శం, మీ సత్కార్యాలూ, మీ సభారంజకత్వం, మీ చెణుకులు, మీరు వినిపించే సూక్తులూ, మీరు సుతిమెత్తంగా మమ్మల్ని సవరించి సంస్కరించే హితవచనాలు, ఆశంసలూ, అభిశంసలూ అన్నీ మాలో భద్రంగా, నిత్యనూతనంగా, శాశ్వతంగా – కనీసం నాలో ఊపిరున్నంత వరకూ, నా తర్వాతి తరాల వారూ వారికి ఊపిర్లున్నంత వరకూ వుండిపోతాయి.

మీతో మా జ్ఞాపకాలు తరాల భేదంతో చెరిగిపోవు – మారుతున్న కాలానికి కరిగిపోవు.

ఇది తథ్యం! సత్యం!!

– కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి

వ్యవస్థాపక చైర్మెన్, శాంతా బయోటెక్



బాలు మాట... బంగారు బాట

నేడు అత్యున్నత స్థానంలో ఉన్న ప్రతిఒక్కరూ ఒకప్పుడు అపజయాలను చవిచూసినవారే. పెద్ద గాయకునిగా నేను మీకందరికీ తెలుసు. నా జీవితంలోనూ ఎన్నో ఆటుపోట్లున్నాయి. నా ప్రస్థానం పూలపాన్పు కాదు. నిరంతర కృషి, సాధన, తపనతోనే ఈ స్థాయికి చేరుకున్నా...





బాలు జీవిత ప్రస్థానం

# పాట అమృతతుల్యం.. మాట ఆణిముత్యం

## • భారతీయ సంగీత రంగానికే 'మణి'మకుటం

***పా**టకు సరికొత్త పరిమళాలను అద్ది, తన గాత్రంతో మరింత సుగంధ సౌరభాలను చేకూర్చి తెలుగు పాటకు అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చిపెట్టిన మహనీయుడు.. గానగంధర్వుడు శ్రీ శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం గారు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది ఆయన్ను, ఆయన పాటలను, ఆయన మాటలను ప్రేమిస్తారు. ఆయన పాటంటే అమృతతుల్యంగా, ఆయన మాటంటే ఆణిముత్యంగా భావిస్తారు. ఆయన్ను చాలామంది ముద్దుగా బాలు అని పిలుచుకుంటారు. మరికొందరు ఎస్పీబీ అంటారు. ఆయనకు సన్నిహితులు ఆత్మీయులైన ఇంకొందరు ఆయన్ను ఆప్యాయంగా 'మణి' అని పిలుస్తుంటారు. ఎవరే పేరున పిలిచినా బాలు పలుకుతుంటారు. వారితో తన స్నేహపరిమళాలను పంచుకుంటూ ఉంటారు. ఎవరినీ ఎప్పుడూ ఏ విధంగా కూడా బాధించని మంచి గుణం ఆయనది. స్నేహితులకు ఆప్తమిత్రుడు, బంధువులకు ఆత్మబంధువు, అభిమానులకు అనురాగసింధువు.. ఇలా అందరినీ అన్నివిధాలా ప్రేమిస్తూ అభిమానించే తత్వం ఆయనది. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపుపొందిన మహాగాయకుడైనప్పటికీ ఎంతో చిన్నవారిని కూడా ఎంతో గౌరవంగా పలకరిస్తారాయన.*

**ఎం**త ఎదిగినా ఒదిగిపోయే నైజం బాలు గారి సొంతం. సంగీత రంగంలో ఎనలేని ప్రతిభా పాటవాలతో పాటు వ్యక్తిగతంగా కూడా ఆయనెంతో సహృదయుడు. దేశానికి, సమాజానికి, తన చుట్టూ ఉన్న వారికి, సాటి మనుషులకు సేవచేయాలన్న దృఢసంకల్పం కలిగిన సమాజసేవా పరాయణుడు. అలాంటి మానవీయమూర్తి..సౌజన్యమూర్తి జీవితంలోనూ ఎన్నో ఆటుపోట్లున్నాయి. ఎన్నో కష్టనష్టాలు..కన్నీళ్ళు ఉన్నాయి. అయినా వాటన్నిటినీ ఆత్మస్థైర్యంతో దాటుకుంటూ సంగీత రంగంలో తను అనుకున్న లక్ష్యాన్ని అధిగమించడమే కాక, ఇంకెవరూ అందుకోలేని సమున్నత శిఖరాలను కూడా ఆయన అందుకున్నారు.

### మధ్యతరగతి సంప్రదాయ కుటుంబంలో జననం



బాలు గారి తల్లిదండ్రులు
సాంబమూర్తి - శకుంతలమ్మగార్లు

బాలు ఓ మధ్య తరగతి సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబంలో పుణ్యమూర్తులైన శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి, శకుంతలమ్మలకు 1946 జూన్ 4న జన్మించారు. తండ్రి సాంబమూర్తిగారు హరికథా విద్వాంసులు. వీరికి ఎనిమిదిమంది పిల్లలు. అందులో అయిదుగురు ఆడపిల్లలు. బాలుకు సంగీతంలో ఆయనే తొలి గురువు. తండ్రి హరికథా గానాలు, భక్తిరసప్రధానమైన నాటకాలు ప్రదర్శిస్తుండడంతో బాలుకు కూడా వాటిపట్ల తెలియకుండానే వాటి ముద్ర పడింది. సంగీతరంగం పట్ల మరింతగా మనసు మళ్ళింది. అందుకు తగ్గట్టుగానే తండ్రి బాలును ప్రోత్సహించేవారు కూడా. చిన్నవయసులో అంటే కేవలం అయిదేళ్ళ పసిప్రాయంలోనే బాలు 'భక్తరామదాసు' నాటకంలో తన తండ్రితో కలిసి నటించారు. పాటలు పాడడంలో కూడా బాగా ఇష్టంగా ఉండడంతో బాలు చిన్నతనం నుంచే సినిమాపాటలు విని వాటిని బాగా పాడేవారు. అన్నగారైన లింగమూర్తి బాలుకి పాటలు పాడడంలో మరింత ఆసక్తిని పెంచాడు. ఇంట్లో రేడియో లేకపోతే పక్కింట్లో రేడియోలో వచ్చే పాటల్ని ఎంతో శ్రద్ధతో వింటూ ఆ పాటల్ని తాను కూడా బాగా పాడేవారు బాలు.


### జాతీయస్థాయి లలిత సంగీత పోటీల్లో బాలుకు అ'ద్వితీయ' బహుమతి :

బాలుని ఇంజనీర్ చేయాలని తండ్రి సాంబమూర్తిగారు అనుకునేవారు. బాలు బాగా చదువుకుని రాణించాలని ఆయన తపించేవారు. బాలు కూడా అందుకు తగ్గట్టుగా బాగా చదువుకుంటూ చదువులోనూ ఆటల్లో కూడా ఫస్ట్‌గా ఉండేవారు. చిత్తూరు జిల్లాలోని నగరిలో మేనమామ శ్రీనివాసరావు ఇంట్లో ఉంటూ నగరి, శ్రీకాళహస్తి బోర్డు స్కూల్స్‌లో ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తిచేసి తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో పియుసి చదివారు. పాటలు, నాటకాలంటే బాలుకు ఎంతో ఇష్టం. మృదువైన మాటలు, లేత శరీరంతో బాలు ఎంతో అందంగా ఉండేవారు. అందువల్ల స్త్రీ పాత్రలు కూడా బాగా పోషించేవారు. పియుసి చదివే రోజుల్లోనే ఒకసారి ఆలిండియా రేడియో నాటికల ప్రసారానికి బాలు బృందం మద్రాసుకు వెళ్ళినప్పుడు, అక్కడి నిబంధనల ప్రకారం స్త్రీపాత్రలు స్త్రీలే వేయాలే తప్ప పురుషులు వేయడం నిషిద్ధం. అందువల్ల ఆ నాటికను వారు అనుమతించలేదు. అయితే నిర్వాహకుల అభ్యర్థనతో వారిచేత ఒక రిహార్సల్ వేయించి బాలు అద్భుతమైన కంఠం, అద్వితీయమైన నటనతో ఆ రేడియో వాళ్ళు నిబంధనలను సడలించి బాలు చేత స్త్రీ పాత్రగానే నాటికను ప్రసారం చేయించారంటే ఎంత విశేషమైన సంఘటనో చూడండి. అప్పట్లోనే 'ఈ ఇల్లు అమ్మబడును', 'ఆత్మహత్య' వంటి నాటికల్లోనూ బాలు ఎంతో ప్రతిభతో నటించి అందరి కరతాళధ్వనులందుకున్నారు. అంతేకాదు బాలు స్వయంగా రాసి బాణీ కట్టి పాడిన పాటకు ఆలిండియా రేడియో విజయవాడ స్టేషన్ వారు దేశవ్యాప్తంగా నిర్వహించిన లలిత సంగీతపోటీల్లో ద్వితీయ బహుమతి రావడం కూడా ఒక అద్వితీయమైన విషయమే. పియుసి పరీక్షలు రాసి నెల్లూరుకు వచ్చిన తర్వాత కూడా ఇక్కడ ఒక ఆర్కెస్ట్రా బృందాన్ని తయారుచేశాడు బాలు. మిత్రులతో కలసి ప్రదర్శనలిచ్చేవారు కూడా. ఆ తర్వాత అనంతపురంలో ఇంజనీరింగ్ సీటు వచ్చి చేరినా, అక్కడి వాతావరణం నచ్చక సెలవుల్లో నెల్లూరుకు తిరిగి వచ్చిన బాలు ఇంక మళ్ళీ అనంతపురం వెళ్ళలేదు. మద్రాసుకు వెళ్ళి ఏఎంఐఇ చదివేందుకు ఇష్టపడ్డాడు. దీంతో బాలుకు మద్రాసుతో అనుబంధం మొదలైంది. స్నేహితుడు మురళితో కలసి మద్రాసు వెళ్ళి ఏఎంఐఇలో చేరారు.

### 1963లో అఖిలభారత సంగీతపోటీలలో బాలుకి ప్రథమ బహుమతి :

అది బాలు జీవితం మలుపు తిరిగిన రోజు. 1963లో మద్రాసులోని ఆంధ్రా క్లబ్ వారు అఖిలభారత స్థాయి

(మిగతా 14వ పేజీలో)





భగవద్గీత ఎంతో పవిత్రమైన గ్రంథం. ఆచరించాల్సిన.. పూజించాల్సిన గ్రంథం కూడా. అయితే దురదృష్టవశాత్తూ భగవద్గీత శ్లోకాలను .. ఎవరైనా చనిపోయినప్పుడు లేదా అంత్యక్రియలప్పుడు మాత్రమే వాడుకోవడం పెద్ద తప్పు. అందుకే భగవద్గీతపై అందరూ సదవగాహన కలిగించుకోవాలి.

బాలు మాట... బంగారు బాట

# 'ప్రభా'తం

'భారతీయ సంగీతం...ఓ గొప్ప స్వరాన్ని కోల్పోయింది'..

**- బాలు మృతికి.. భారత రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ సంతాపం.**

'భారతదేశమంతటా సుపరిచితుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం. ఆయన మరణం ఎంతో దురదృష్టకరం. దశాబ్దాల తరబడి శ్రోతల్ని సమ్మోహితుల్ని చేశారు. ఆయన మరణంతో..మన సాంస్కృతిక ప్రపంచం ఒక్కసారిగా నిరుపేదదిగా మారిపోయింది'.

**- భారత ప్రధాని మోడీ నివాళి.**

ఔను!... మన దేశం హిమాలయ శిఖరమంత సమున్నతమైన స్థానంలో ఉన్న ఒక మహోన్నతమైన గాయకుడిని కోల్పోయింది. ఇన్నాళ్ళూ..ఇన్నేళ్లూ కోట్లాదిమంది అభిమానులను, ప్రజలను తన మధుర గానంతో ఓలలాడించిన ఆ గంధర్వగానం మూగబోయింది. భరతమాత ముద్దుబిడ్డగా.. కళామతల్లి వ(స్వ)రపుత్రుడుగా దివి నుంచి భువికి వచ్చిన ఆ గానగంధర్వుడు.. మళ్ళీ ఏ గంధర్వలోకాలకో తిరిగి వెళ్లిపోయాడు. ఏళ్ళ తరబడి సంగీత సామ్రాజ్యాన్నేలిన రారాజుగా, పాటల రేడుగా.. అందరి అభిమానాన్ని పొందిన బాలూ ఇక లేరనుకునే మాటే ఎవరికీ జీర్ణం కావడం లేదు. తేటతేనియల తెలుగుపాటకు తన గంధర్వ గానంతో అంతర్జాతీయ ఖ్యాతినార్జించి పెట్టిన సుమధుర గాయకుడు మన ఎస్పీ బాలు. ఆ మధురమైన స్వరం..ఆయనకు ఆ దేవుడిచ్చిన వరం. ఆ మధురగానంతో పాటల లోకంలో 'బాలూ శకం' ప్రారంభమైంది. ఎన్నో ఏళ్ల పాటు అప్రతిహతంగా విజయదుందుభిని మోగిస్తూ ముందుకు దూసుకు పోయింది. దేశవ్యాప్తంగా ఎన్నెన్నో ప్రభంజనాలు సృష్టించింది ఆయన గాత్రం.. ఆయన పాటలు మధురాతిమధురాలు. మాటలు అమృత రసగుళికలు. పదహారు భాషల్లో సంగీతానికి స్వరాభిషేకం చేసి..అనితరసాధ్యమైన రీతిలో పాటకు పట్టాభిషేకం చేసిన స్వరబ్రహ్మ ఆయన. ఆయనలా అనేక భాషల్లో.. ఇలా వేల పాటలు అత్యద్భుతంగా పాడి కోట్లాదిమంది హృదయాల్లో స్థానం సంపాదించుకున్న వారు దేశంలోనే కాదు, ప్రపంచంలోనే లేరంటే అతిశయోక్తి కాదు. అది మనందరికీ గర్వకారణం. బాలు మనవాడు కావడం మనందరి అదృష్టం.

సెప్టెంబర్ 25వ తేది..శుక్రవారం మధ్యాహ్నం..ఒంటి గంటా నాలుగు నిమిషాలకు మద్రాసులోని ఎంజిఎం ఆసుపత్రిలో భారతీయ సినిమా గాయకుడు..శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం గారు అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారన్న సమాచారం అశేష ప్రపంచప్రజానీకాన్ని విషాదసాగరంలో ముంచింది. ఆ దినం..భారతీయ సినిమా సంగీత ప్రపంచానికే ఒక దుర్దినం. ముఖ్యంగా తెలుగుపాటకు అది చీకటిరోజు. తెలుగు, తమిళ, మలయాళ, హిందీ తదితర 16 భాషల్లో బాలు సుమారుగా 40 వేలకు పైగానే పాటలు పాడారంటే అదో ప్రపంచ రికార్డు. బాలు అసాధారణ ప్రతిభా పాటవాలకు ఇది నిదర్శనం. అలాంటి గానగంధర్వుడు మనకిక లేకపోవడమనే బాధ ఇప్పటికే కాదు..ఎప్పటికీ తీరేది కాదు.

దాదాపు 40 వేలకు పైగానే సినీగీత సంగీతాల సుమాలకు తన గాత్ర సౌరభాలతో పరిమళాలు అద్ది.. ఆ సంగీత సరస్వతికి కంఠాభరణంగా సమర్పించిన కళామతల్లి ముద్దుబిడ్డ బాలూ.. ఇక లేకపోవడం దేశానికే కాదు.. ప్రపంచానికే తీరని లోటు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది అభిమానులకు అంతులేని శోకాన్ని మిగిల్చి.. తాను మాత్రం పాటను..పాటలోని మాధుర్యాన్ని కూడా తనతోపాటు నడిపించుకుంటూ ఏ గంధర్వ లోకాలకో ఆయన వెళ్ళిపోయారు. దాదాపు యాభైఏళ్ళుగా క్షణం కూడా తీరికలేకుండా.. అలుపెరుగని పాటల బాటసారిగా జీవనయానం సాగిస్తూ..'అలసితీ.. సొలసితీ'..అంటూ అన్నమయ్య పాటను తనకు గుర్తుగా మన గుండెల్లో వదిలిపెట్టి 'ఇక సెలవంటూ'... భువి నుంచి దివికి తరలి వెళ్ళిపోయారు. అయినా.. ఆయనలా హృద్యంగా పాటలు పాడేవారు.. ఆయనలా మంచి మాటలు చెప్పేవారు.. పాత-కొత్త తరాల గాయనీ గాయకులకు వారధిగా.. చలనచిత్ర రంగాల్లోని అపూర్వమైన విశేషాలను కళ్ళకుకట్టేలా వినిపించే సారధిగా.. ఇంక మనకింకెవరున్నారు?... ఒక్క తెలుగుజాతికే కాదు, మొత్తంగా భరతజాతికీ.. విశ్వమానవాళికంతటికీ గర్వకారణమైన సంగీత సామ్రాట్ ఆయన. అంతటి మహానుభావుడికి మనమేమిచ్చుకోగలం?... రెండు చేతులెత్తి నిండుమనసుతో నమస్కరించుకోవడం తప్ప!... ఏమిచ్చి ఆ మహనీయుని రుణం తీర్చుకోగలం?..

అత్యుత్తమ నేపథ్య గాయకునిగా బాలుకు వచ్చిన అవార్డులు లెక్కలేనన్ని. దేశంలోని ఎంతో విశిష్టమైన 'పద్మశ్రీ', 'పద్మభూషణ్' పురస్కారాలను కూడా అందుకోవడం ఆయన ప్రతిభా'పాట'వాలకు నిదర్శనాలు. సంగీతమే జీవితంగా.. జీవితమే సంగీతంగా.. ఆయన జీవితమంతా జీవించాడు. ప్రపంచవ్యాప్తంగా వేలాదిమంది వర్ధమాన గాయనీగాయకులకు ప్రోత్సాహమందించారు. అందుకే ఆయన అసాధారణ సేవలకుగాను బాలుకు 'భారతరత్న' ఇవ్వాలని ముఖ్యమంత్రి జగన్ ఒక లేఖలో సెప్టెంబరు 28న భారత ప్రధాని మోడీకి విజ్ఞప్తి చేయడం.. అది అయిదు దశాబ్దాల పాటు బాలు చేసిన అవిరళ కృషికి దక్కే గొప్ప గుర్తింపుగా ఎప్పటికీ తమ జ్ఞాపకాల్లో నిలచిపోతుందని కూడా ఆ లేఖలో జగన్ పేర్కొనడం కోట్లాదిమంది బాలు అభిమానులకు ఊరట కలిగిస్తోంది. బాలును తలచుకుంటూ సంగీతప్రపంచమే విలవిల్లాడుతున్న ఈ విషాదకర తరుణంలో.. కోట్లాదిమంది అభిమానులకు నిజమైన ఓదార్పునిచ్చేది.. సీఎం వైయస్ జగన్మోహన్‌రెడ్డి పేర్కొన్నట్లుగా బాలుకి 'భారతరత్న' ఇచ్చినప్పుడే. ప్రజల ఆకాంక్షలను సహృదయంతో అర్థం చేసుకునే ప్రధాని మోడీ సారధ్యంలోని కేంద్రప్రభుత్వం సిఎం జగన్ చేసిన విజ్ఞప్తిని.. సకల జనం విజ్ఞప్తిగా పరిగణించి బాలుకు 'భారత రత్న' పురస్కారాన్ని త్వరలోనే ప్రకటించాలని కోరుకుంటూ.. భారతీయ సినిమా గాయకుడు.. వేలాది పాటలతో ప్రజలందరినీ అలరించి.. సంగీతరంగానికి కొన్ని తరాలపాటు కొదవలేకుండా శాశ్వతమైన.. చరిత్రాత్మకమైన.. చిరస్మరణీయమైన సేవలందించిన ఈ యుగ గాయకుడు.. కారణ జన్ముడైన శ్రీ శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం (బాలు) గారి మృతికి తీవ్ర విచారం ప్రకటిస్తూ.. ఆ మహానుభావునికి... కన్నీటి నివాళులర్పిస్తోంది... 'లాయర్'!..

## కారణజన్ముడు



బాలు లాగా అనేక భాషల్లో అత్యద్భుతంగా పాటలు పాడేవారు..ఆయనలా మంచి మాటలు చెప్పేవారు.. పాత-కొత్త తరాల గాయనీ గాయకులకు వారధిగా..వేలాది గానకచేరీలకు సారథిగా.. చిత్రసీమల్లోని అపూర్వమైన విశేషాలను కళ్ళకుకట్టేలా వినిపించే అద్వితీయమైన వ్యాఖ్యాతగా.. ఇంక మనకెవరున్నారు?..అంతటి మహాగాయకునికి మనవేమిచ్చుకోగలం?..రెండు చేతులెత్తి నిండుమనసుతో నమస్కరించుకోవడం తప్ప..ఏమిచ్చి ఆ మహనీయుని రుణం తీర్చుకో గలం?..

# స్నేహశీలి బాలు గారికి అశ్రునివాళి

బాలూ గారి అకాల మరణం నన్ను తీవ్రంగా కలచివేసింది. ఆయన మానవత్వం మూర్తీభవించిన మనిషి. 'స్నేహమేరా జీవితం, స్నేహమేరా శాశ్వతం' అని మనస్ఫూర్తిగా నమ్మి ఆచరించిన మహనీయుడు. కేవలం తన పాటలు మరియు మాటల ద్వారానే కాకుండా, తన వ్యక్తిత్వంతో యావత్ ప్రపంచాన్ని ఆకట్టుకున్న ధన్యజీవి. స్నేహితులే తన ఆస్తిగా భావించి స్నేహితాన్ని కడదాకా కొనసాగించిన గొప్ప వ్యక్తి. పాటలు పాడడంలో భాషకు, భావానికి ఉన్న ప్రాధాన్యాన్ని గుర్తెరిగి పాడి మెప్పించిన మహాగాయకుడు. ఏ భాషలో పాడినా, అది తన మాతృభాషగానే ఉండేటట్లు పాడి ప్రశంసలు పొందిన కళాకారుడు. పాట, మాట, భావం, భాషలకు ఏ విధంగా ప్రాధాన్యమివ్వాలో భావితరాలకు చాటిచెప్పిన మార్గదర్శి.

ఆయనతో నాకున్న అనుబంధంలో ఎన్నో మరపురాని అనుభూతులు ఉన్నాయి. బాలూ గారి తండ్రి శ్రీ సాంబమూర్తి గారి విగ్రహావిష్కరణ సందర్భంగా 'లాయర్' వారపత్రిక వెలువరించిన 'ఇదీ సాంబమూర్తి కథ' పుస్తకం రూపొందించడంలో బాలూగారితో కలసి పని చేయడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తాను. గత మూడు సంవత్సరాలుగా ఆయన జన్మదిన మహోత్సవ కార్యక్రమాలలో పాలుపంచుకోవడం నా అదృష్టం. బాలూ గారి అకాల నిష్క్రమణతో సంగీత ప్రపంచంలో ఏర్పడిన శూన్యం పూరించగలిగేది కాదు. వారి ఆత్మకు మోక్షప్రాప్తి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. వారి కుటుంబసభ్యులకు, స్నేహితులకు మరియు అభిమానులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. ఆయన ఎక్కడికీ వెళ్ళలేదు. మనతోనే మనలోనే ఉన్నారు.

– డాక్టర్ యం. సుబ్రహ్మణ్యం,
**విశ్రాంత ప్రిన్సిపాల్, వి.ఆర్.కళాశాల, నెల్లూరు.**

లాయర్
పాఠకులకు మనవి
మా(మీ) లాయర్ పత్రికకు
**సమాచారం / లేఖలు**
పంపదలచిన వారు
9866314741 నంబరుకు
వాట్సయాప్ ద్వారా గాని, లేదా
lawyerpatrika@gmail.comకి
ఈ-మెయిల్ ద్వారా గాని
పంపవలసిందిగా విజ్ఞప్తి.
పోస్టల్ చిరునామా :
ఫ్లాట్ నెం. 1 & 2, మెయిన్‌రోడ్డు,
మాగుంట లే అవుట్, నెల్లూరు - 3.
- సం/-

# బాలు గారంటే తెలియనోళ్లు నెల్లూరులో ఎందుకు..?




యస్.పి బాలసుబ్రహ్మణ్యం అంటే ఒక సంగీత "మణి". నెల్లూరోళ్లు చేసుకున్న పూజల ఫలంగా లభించిన అద్భుతమైన వరం అయన స్వరం.

54 సంవత్సరాలు 16 భాషలు, దాదాపు 43వేల పాటలు, ఒక్క గాయకుడిగానే కాకుండా నటుడిగా, సంగీత దర్శకుడిగా, నిర్మాతగా, సంఘ సేవకుడిగా, ఆదర్శ పురుషుడిగా అవతరించిన సంగీత బ్రహ్మ బాలసుబ్రహ్మణ్యం గారు. అయన చనిపోయిన రోజు నెల్లూరులో అమరావతి కృష్ణారెడ్డి అనే ఒక అజ్ఞాని "ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం గారు మన నెల్లూరుకి ఏమి చేయలేదు, మన కళాసంఘాలకు ఏమి చేయలేదు, వారు మనకు పరిచయం లేదు కాబట్టి వారి ఫోటోలు మన గ్రూపులో పెట్టవద్దు" అంటూ బాలుగారికి శ్రద్ధాంజలి ఘటించినవారిని మందలిస్తూ గ్రూపుల్లో మెసేజ్ పెట్టాడు. అసలు ఇలాంటి చవుకబారు వ్యక్తులను సమాజం ఎందుకు గౌరవిస్తుందో అర్థం కాదు. 25 కళాసంఘాలకు ఈయన ఎలా అధ్యక్షుడయ్యాడో, ఇలాంటి కుసంస్కారిని అధ్యక్ష్యుడిగా ఆ 25 కళాసంఘాలు ఎందుకు ఎలా ఎన్నుకున్నాయో అసలు అర్థం కాదు. అసలు ఈయనకు కళలంటే తెలుసా..? ఈయన నడిపిన కట్టెలదొడ్డిలోనో, ఈయన కాల్చిన బొగ్గుల కుంపట్లలోనో, లేక ఈయన వండే వంటలలోనో ఈయన కళలను చూశాడా? వాటిని ఏమైనా నేర్చుకున్నాడా? కళాకారుల సంస్థలకు అధ్యక్షుడిగా కళాకారుడే వుండాలి.. ఈయనలో వుండే కళ ఇదేనా. బాలుగారి లాంటి మహానుభావుడిని గురించి నీచంగా మాట్లాడడమే ఒక కళ అనుకుంటున్నాడా ...? అందరూ ఈయన ఇచ్చే బిరియాని పొట్లాలకోసం ఎగబడే కుక్కలనుకుంటున్నాడా..? అసలు ఎవరైనా వ్యక్తి చనిపోతే ఆ వ్యక్తిలో ఏమైనా లోపాలు వున్నా వాటిని క్షమించి, ఆ వ్యక్తి పట్ల సానుభూతి చూపించే సంస్కృతి మనది. అటువంటిది బాలుగారి లాంటి భగవత్ స్వరూపం దివంగతులైతే, యావత్ ప్రపంచ సంగీత సామ్రాజ్యమే శోక సముద్రంలో మునిగిపోతే... అలాంటి బాలు గారి గురించి అవాకులు చవాకులు పేలిన ఈ దుర్మార్గుడిని ఏమనాలి. అయన కాలి కొన దూళికి కూడా సరితూగ లేని స్థాయి ఇతనిది. బిరియాని పొట్లాలతో ఆకట్టుకుని నలుగురు కళాకారులని వెనక వేసుకుని నాలుగు గోడల మధ్య కార్యక్రమాలు చేసుకుని పేపర్లలో ఫోటోలు వేసుకునే ఇలాంటి చవటలా బాలుగారి గురించి కామెంట్ చేసేది. ఇతని వెనుక ఉన్నది నిజమైన కళాకారులే అయితే ఇతనిని ముఖం మీద కొట్టి.. వాళ్లంతా బయటకు రావాలి. ఇలా నిస్సిగ్గుగా ప్రకటనలిచ్చిన ఆయన్ను వదిలేసి తమదారి తాము చూసుకోవాలి అప్పుడే వాళ్లంతా నిజమైన కళాకారులు. కళామతల్లి ముద్దుబిడ్డ గురించి ఇంత నీచంగా మాట్లాడిన ఆ దుష్టుడిని వాళ్లంతా వెలియ్యాలి. అలా కాకుండా ఇప్పుడుకూడ వాళ్ళు ఆయన వెనకే తోక ఊపుకుంటూ ఆయనే మా నాయకుడని తిరిగితే వాళ్ళు నిజమైన కళాకారులు కాదు, ఖచ్చితంగా బిరియాని బ్యాచ్చే.

– మంచికంటి వెంకట శ్రీనివాసశర్మ,
**హైదరాబాదు.**

**బాలు మాట... బంగారు బాట**

పరీక్షల్లో ఫెయిలయ్యామనో, అప్పుల్లో ఉన్నామనో, పంటలు పండలేదనో వంటి చిన్న కారణాలతో భగవంతుడు మనకు ప్రసాదించిన జీవితాన్ని వదిలేయడం ఎంతమాత్రం మంచిది కాదు. ఎవరైనా సరే ఆలోచించి ముందడుగు వేయాలి. అలా చేసినప్పుడే ఎంతటి సమస్యనైనా అధిగమించవచ్చు.



# మానవత్వానికి మరోపేరు..మా బాలు

**- బాలు ప్రాణస్నేహితుడు సుబ్బారావు**



మా బాలు మానవత్వానికి మరోపేరు. సేవాభావానికి మారుపేరు. చిన్నతనం నుంచి ఆయనది దయాగుణం. అది ఆయన తల్లిదండ్రుల నుంచి వచ్చిన సుగుణం. బాలు మాకు చిన్ననాటి స్నేహితుడు. మా స్నేహబృందంలోని వారంతా ఎంతో ఆత్మీయులు. బాలు గారి సాహచర్యంలో, ఆయన్ను అనుసరించే మేమంతా నడిచేవాళ్ళం. స్నేహానికి వయసు కాదు.. మనసు ముఖ్యం అని బాలు అంటుండేవారు. బాలు గారు సమాజసేవాభిలాషతో చేసిన అనేక సేవా కార్యక్రమాలు ఎవరికీ పెద్దగా తెలియనివ్వలేదు. ఎన్నో గుప్త దానాలు చేసేవారాయన. 2006లో ఎస్పీబి చారిటబుల్ ఫౌండేషన్ స్థాపించి ఎందరికో తనవంతు చేయూతనందించిన మహానుభావుడు బాలు. జిల్లాలోనూ, రాష్ట్రంలోనే కాదు.. దేశంలో ఎక్కడ ఏ విపత్కర పరిస్థితి ఎదురైనా బాధితులకు ఆదరహస్తం అందించేందుకు ముందుండేవారు. పలుసార్లు తుఫాన్ బాధితులకు, కరువు బాధితులకు లక్షలాది రూపాయల విరాళాలను కూడా అందించారు. తన కనుదగిలిన అసహాయులకు ఆయన ఎవరికీ తెలియకుండానే తనవంతు సాయం చేసేవారు. నిరుపేద విద్యార్థులు చదువుకునేందుకు అర్థిక సాయం చేసేవారు. గుండె జబ్బులతో బాధపడే పేదలకు సాయం అందించేవారు. పేద కళాకారులకు నేనున్నాంటూ ఆదరహస్తం అందించేవారు. ప్రత్యేకించి తన సంపాదనలో కొంత భాగాన్ని ఆయన సమాజసేవకు వినియోగించేవారు. ముఖ్యంగా తాను చేసే సాయాన్ని ఏదీ గొప్పలుగా చెప్పుకునే తత్వం తొలినుంచి లేదాయనకు. మిత్రులకు, వారి కుటుంబాలకు ఎంతో సాయం చేసేవారు. అందరూ బాగుండాలని ఆయన నిరంతరం తపన పడుతుండేవారు. ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండే.. అంత మంచి మనిషి..అంత మంచి మనసు ఉన్నవారు ఈ కాలంలో ఎంతైనా అరుదే. అంతర్జాతీయస్థాయి ఖ్యాతి గాంచినా ఆయన ఎంతో నిరాడంబరంగానే ఉండేవారు. అందరితో ఆత్మీయంగా మాట్లాడేవారు. ప్రత్యేకించి చిన్నారుల కళాప్రతిభను ప్రోత్సహించేవారు. బాలు గారు ఈ సమాజానికే కాదు..ప్రపంచానికే గొప్ప వరం!..అంత గొప్ప గాయకుడు, అంత మంచి సమాజ సేవకుడు బాలు కాక మనకు ఇంకెవరున్నారు?.. మా మిత్ర బృందం తొమ్మిదిమందిలో బాలు గారితో పాటు చిన్ననాటి మిత్రులు మురళి, ఎంకె ప్రసాద్, దూబగుంట రామకృష్ణ, ఆర్.సుబ్రహ్మణ్యం, వైజాగ్ సుబ్బయ్య, పి.యుగంధర్, యోగి, వైకె మురళి తదితర స్నేహితులంటే బాలు గారికి ఎంతో అభిమానం. ఇప్పటికే బాలుగారి బాల్యస్నేహితుల్లో వై.కామేశ్వర రావు, ఎం.విఠల్‌రావు, పి.నాగరాజా రావులు గతించిపోవడం మా మిత్రబృందానికి తీరనిలోటు. తనకు ఎప్పుడు ఏ చిన్న సాయం చేసినా బాలు గారు ఎప్పుడూ విస్మరించేది ఉండదు. వారిని ఎంతో బాగా గుర్తుపెట్టుకుని అంతకు పదింతలు అధికంగా సాయం చేసి కృతజ్ఞత తెలుపుకునే మనస్తత్వం ఆయనది. అంతటి గొప్ప గుణాలెన్నో ఉన్న బాలు గారితో ఎంతో కాలంగా ఉన్న మిత్రుల్లో వెన్నెలకంటి రాజేశ్వరప్రసాద్, వై.శేషగిరీశం, ఎంవిఎస్ ప్రసాద్, వై. విశ్వనాథం, రాజేంద్రకుమార్, బి.శ్యామ్‌సుందర్, శివ, సత్యం, అనంత్, సీనియర్ నటులు రాజగోపాల్ గారు తదితరులు ముఖ్యులు. నెల్లూరులో విజేత ఆర్ట్స్ అనే కళాసంస్థ బాలు గారు స్థాపించిన తర్వాత వీరంతా కూడా ఆ సంస్థను నేటికీ కాపాడుకుంటూ వస్తున్నారు. వారు ఏ చిన్న కార్యక్రమం నిర్వహించినా అన్నదాత మురళీకృష్ణ గ్రోసు గోపాలయ్య గారు, హజరత్‌బాబు గార్లు, బాలు గారి కెంతో ఆత్మీయులైన 'లాయర్' పత్రిక అధినేత ప్రభు గారు తదితరులంతా సహకారం అందించేవారు. ఎల్లప్పుడు మా స్నేహాన్ని అభిలషిస్తూ..మా శ్రేయస్సును ఆకాంక్షించే బాలు లేని లోటు తీరనిదే!

## ఏందబ్బాయ్యా ఇట్ట చేశావా...?



ఏందబ్బాయ్యా ఇట్ట చేశావా....? నువ్వు నెల్లూరికొచ్చినప్పుడల్లా పండగ సేసుకుంటుంటిమే, మల్లీ నువ్వెప్పుడువస్తావా అని ఎదురు సూస్తుంటిమే, నువ్వేంది ఇట్ట చేశావు...? ఇంటికాడ కొచ్చినప్పుడల్లా సుట్టుపక్కల సుభ్రంగా లేదని తిడతా వుంటివి, మన ఇంటి లాగా, మన ఒంటిలాగా మన వూరిని కూడా సుబ్రంగా పెట్టుకోవాలని అక్కడ అంగల్లోళ్లందరికి సెప్తుంటివి, ఏంది మందలా అంటూ అందర్నీ పలకరిస్తుంటివి, ఇప్పుడేందబ్బయ్యా ఇట్ట చేశావా....? మీ నాయన బొమ్మకోసం తపన పడితివి, మీ అమ్మ సచ్చిపోతే అల్లాడి పోతివి, సందు దొరికితే నెల్లూరికి వస్తానే వుంటివి, నెల్లూరులో పేదోల్ల కోసం పెల్లి మండపం కడతానంటివి, దాన్ని అందరికి ఫ్రీగా ఇస్తానంటివి, ఇప్పుడేమో సెప్పా పెట్టకుండా ఎల్లిపోతివి, ఏందబ్బాయ్యా ఇట్ట చేశావా...?

టౌనాలు కాడకొస్తే.. నువ్వే గుర్తొస్తావు.. ఇప్పుడాడకెల్తే నువ్వులేని టౌనాలు దిగులు బడిపోయింది, నెల్లూరులో పాటపాడేవోళ్ళు, నాటకాలోళ్ళు, నిన్నే నమ్ముకుని బతుకుతున్న పాతకాలపు నీ సిస్య బుందం... ఈల్లంతా ఏమైపోవాలా?.. ఏందబ్బయ్యా ఇట్ట చేశావా?

నెల్లూరులో ఇల్లు కొంటానంటివి, బాధ్యతలు శరన్‌కి అప్పగించి ఇక ఇక్కడే ఉండిపోతానంటివి, తేగరాజ పండగలకు నువ్వే బిచ్చమెత్తతానంటివి, నీ సివరి రోజుల్లో నీ పాత ఫ్రెండ్సు తో నెల్లూరులోనే గడపతానంటివి, వందేళ్లు బతకతానంటివి, అమ్మ పక్కనే నీకు సమాధి కావాలంటివి, ఇప్పుడేమో అడ్రస్సులేకుండా ఎల్లిపోతివి... ఏందబ్బాయ్యా ఇట్ట చేశావా...?

కామెడీ యాక్టరు బెమ్మానందం సెప్పినట్టు నీ విలువ నీకు తెలియదబ్బయ్యా....! అనుమంతుడు కూడా నీలాగే వంగి వంగి వుంటాడంట, కానీ ఒక్కసారి ఇశ్వరూపం సూపిస్తే ఎవడైనా బయపడాల్సిందేనంట... అట్టా, నువ్వుకూడా వంగి వంగి ఇనయంగా వుంటావంట ఒక్కసారి నీ ఇశ్వరూపం సూస్తే... నువ్వెందో అవతలోల్లకి అర్ధమైపోతుందంట, ఇది నేనంటున్న మాట కాదబ్బయ్యో.. బెమ్మానందం నీ గురించి చెప్పిన మాట..! కాని ఎల్లిపోయిన తరువాత నీ ఇశ్వ రూపం సూపిత్తుండావు. ఎందబ్బయ్యా ఇట్ట చేశావా...?

నువ్వు లేకుంటే సినిమా పాట ఏమై పోవాల, నువ్వు లేకుంటే కొత్త పిల్లకాయలకు తోడెవరు, నువ్వులేకుంటే పాత కతలు సెప్పేదెవరు, నువ్వు లేకుంటే మన నెల్లూరు కళలకు దిక్కెవరు...? నువ్వుంటే నెల్లూరుకు కళ, నువ్వుంటేనే నెల్లూరుకి గ్లామర్, నువ్వుంటేనే.. నెల్లూరుకు సోకు, నువ్వుంటేనే నెల్లూరుకు ఎలుగు, నువ్వుంటేనే మాట, నువ్వుంటేనే పాట, అందుకే సెప్తుండా... అయ్యా సుబ్రమణ్యమా పైన మందల గబాన చూసుకుని తొందరగా రావయ్యా.... నువ్వు లేకుండా మేమెట్టా బతకాలయ్యా.... అయ్యో.. ఏందబ్బయ్యా ఇట్ట చేశావా....??

– సంచారి





మాతృభాషను మనం ఏనాటికీ మరచిపోకూడదు. మన తెలుగుభాషను మనం ఎల్లవేళలా పరిరక్షించుకుంటూ ఉండాలి. మన అమ్మభాషను మనం కాపాడుకోవడం మన బాధ్యత!..

బాలు మాట... బంగారు బాట



# సంగీత గగనాన.. జాబిల్లి

## ఆ స్వరం.. ఆయనకో వరం!.. బాలు కీర్తి అజరామరం!

***బాలు..ఒక అద్భుతం! బాలు అంటేనే ఓ పాటల జలపాతం. ఎంతటివారినైనా మంత్రముగ్ధులను చేసే ఆయన పాట–మాట ఎంతైనా అద్వితీయం!..అంతేకాదు సంగీతరంగంలో తనకెంతో తెలిసినా ఏమీ తెలియనట్లుంటే వినమ్రత ఆయన సుగుణం. ఆ గంధర్వగానం..ఆ మధురమైన స్వరం..ఆయనకు ఆ భగవంతుడిచ్చిన వరం!..అందుకే ఆయన కీర్తి అజరామరం!..***

భారతీయ సినీ సంగీతరంగంలో ఎంతోమంది ప్రఖ్యాత గాయకులున్నా.. తన మాతృభాష అయిన ఒక్క తెలుగులోనే కాక మరో 16 భాషల్లో కూడా అవే తమ మాతృభాషలైనట్లుగా అత్యంత అలవోకగా గానం చేసే సహజ గాన కళా చతురత బాలు సొత్తు. ఆయా భాషలు నేర్చుకోవ డానికి ఆయన నిరంతరం శ్రమించేవారు. కేవలం సినిమా పాటలే కాదు ప్రైవేటుగా కొన్ని వేల లలితగీతాలు, భక్తిగీతాలు కూడా పాడి తన గాత్రానికి ధన్యత తెచ్చు కున్నారు. జీవితంలో ఒక్క క్షణం కూడా వృధా చేయకుండా ఎంతో కృషితో, పట్టుదలతో, నిరంతర సాధనతో ఆయన సమున్నత శిఖరాలను అందుకున్నారు. సంగీత గగనాన ఆయనే జాబిల్లి. అయినా 'మామా చందమామా'.. అంటూ ఆయన ఆర్ద్రతగా పాడితే చాలు.. నల్లమబ్బుల దొంతరల్లోంచి తొంగిచూసే ఆ చందమామే ఆ పాట వినేందుకు నేలకు దిగివస్తాడా అన్నంత అనుభూతి కలుగు తుంది. అదేకాదు.. ఆయన ఏ పాట పాడినా అద్భుతమే!..అవి యుగళగీతాలా, లలిత గీతాలా, విరహగీతాలా.. భక్తి గీతాలా.. దేశభక్తి గీతాలా.. గీతమేదైనా సరే.. దానిలోని భావాన్ని వెలికితీసి.. ఆ గీతానికి ప్రాణం పోసి.. వీనులవిందుగా గానం చేసి..అందరినీ ఆ గానామృతంలో ఓలలాడించడంలో ఆయనకున్న ప్రజ్ఞా పాటవాలు అపూర్వం..అద్వితీయం.. అసామాన్యం!.. వానలో తడవని వారుం డనట్టే..బాలు గానప్రవాహంలో తడిసి ముద్దయిన వారు లేరనడం ఎంతమాత్రం అతిశయోక్తి కాదు.

### బాలు గానానికి పేరు తెచ్చిన.. 'సుఖ దుఃఖాలు'

బాలు 1967లో శ్రీశ్రీశ్రీ మర్యాద రామన్న చిత్రంలో గానం చేసినా, ఆ తర్వాత 1968లో 'సుఖదుఃఖాలు' చిత్రం లోని 'మేడంటే మేడా కాదు.. గూడంటే గూడూ కాదు'.. అనే పాట బాలుకు ఎంతో పేరు తెచ్చింది. ఈ పాట అప్పట్లో తెలుగు చిత్రసీమలో సంచలనం సృష్టించింది. ఈ చిత్రానికి కూడా సంగీత దర్శకుడు కోదండపాణి గారే. ఆ తర్వాత 1971లో 'చెల్లెలికాపురం' చిత్రంలో 'చరణ కింకిణులు ఘల్లుఘల్లుమన'.. అనే పాటతోనూ, ఆ తర్వాత 1973లో 'కన్నెవయసు' చిత్రం లోని 'ఏ దివిలో విరిసిన పారిజాతమో'.. అనే పాటతోనూ బాలు గానం మరింత ప్రఖ్యాతిలోకి వచ్చింది. ఇక ఆనాటి నుంచి ఎన్నో సినిమాల్లో ఆయనకు గాయకు నిగా అవకాశాలు వచ్చాయి. 1980లో 'శంకరాభరణం' చిత్రం ద్వారా దర్శకుడు కె.విశ్వనాథ్ ఇచ్చిన అవకాశంతో బాలు ఆ చిత్రంలో పాడిన పాటలు అశేషప్రజా నీకాన్ని ఉర్రూతలూగించాయి. 'శంకరా!.. నాద శరీరా పరా'.. అంటూ గళమెత్తి పాడిన బాలూ పాటలు నేరుగా హిమ శిఖరాలకు వెళ్ళి ఆ శంకరుని పాదపద్మ యుగళానికి పొర్లు దండాలు పెట్టుకోవా లన్నంత భక్తిపారవశ్యంతో పొంగి పొర్లుతూ.. ఆకాశమంత ఎత్తుకు పాకి.. విశ్వవ్యాప్తంగా సంచలనం కలిగించాయి.. బాలు గానంలో ఇంత శక్తి దాగి ఉందా అని ప్రపంచమే విస్తుపోయింది. బాలు గంధర్వ గానంలోని మాధుర్యంతో పాటు ఆయన అంతరాంతరాళాల్లో దాగివున్న సంగీత ప్రతిభను చూసి చిత్రపరిశ్రమ ఆ దివ్యగాన కళామూర్తికి కరతాళధ్వనులతో అభినం దనలు తెలిపింది. దీంతో బాలు గానమాధుర్యం ఆకాశమే హద్దుగా ముందుకు దూసుకుపోయింది.

### ఎన్నెన్నో ప్రతిష్టాత్మక అవార్డులు.. పురస్కారాలు

విఖ్యాత గాయకునిగానే కాక, సంగీత దర్శకునిగా, నటునిగా, డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా, వ్యాఖ్యాతగా బాలు భారతీయ సినిమా రంగానికి బహుముఖ సేవలందించారు. ఆయా రంగాల్లో జాతీయస్థాయిలో సైతం ఎన్నో విశిష్టమైన, ప్రఖ్యాతమైన, ప్రతి ష్టాత్మకమైన అవార్డులను, పురస్కారాలను అందుకున్నారు. వివిధ భాషల్లో సుమారు 40వేలకుపైగా పాటలు పాడారు. సాటిలేని గాన ప్రతిభతో రాణించారు. ఉత్తమ నేపథ్యగాయకునిగా ఆరుసార్లు జాతీయ పురస్కారాలను అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 25 సార్లు నంది అవార్డు లను పొందడంతో పాటు, కర్నాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి అనేక పురస్కారాలను అందుకున్నారు. దేశంలోని ఎంతో విశిష్టమైన 'పద్మశ్రీ' అవార్డును 2001లోను, 2011లో 'పద్మభూషణ్' పురస్కారాన్ని అందుకోవడమే కాక 2016లో భారతీయ సినీ దిగ్గజంగా బాలు ఘనమైన పురస్కారం అందుకున్నారు. 2016లో గోవాలో జరిగిన అంతర్జాతీయ చలనచిత్రోత్సవాల్లో 'సెంటినరీ అవార్డ్ ఫర్ ఇండియన్ ఫిలిం పర్సనాలిటీస్ ఆఫ్ ది ఇయర్' పురస్కారానికి ఎంపికై 'భారతీయ సినీ దిగ్గజం'గా అవార్డును సాధించారు. ఇలాంటి ఎన్నో ఘనతలు ఈ యుగంలో.. ఈ తరంలో ఒకే ఒక్క బాలుకే సాధ్యం అనిపించుకున్నారు. ఇక మిగిలింది ఒకే ఒక్కటి..అదే దేశ అత్యున్నత పురస్కారం.. 'భారతరత్న'. సంగీతరంగంలో ఇంత కాలంగా అనర్ఘరత్నంగా ప్రకాశించిన బాలుకు.. ఈ విశిష్టమైన 'భారతరత్న' కూడా త్వరలోనే వస్తుందనే ఆశిద్దాం!...

తన అమేయమైన ప్రతిభా పాటవా లతో బాలు సినీరంగంలో రారాజులా రాణించారు. హాస్యనటులకు కూడా..వారే స్వయంగా ఆ పాటలు పాడుతున్నట్లు అనిపించేలా అత్యద్భుతమైన రీతిలో బాలు వారికి పాటలు పాడారు. తన గానంతో పాటు ఎందరో మహానటులకు గాత్ర దానం కూడా చేశారు. సంగీత దర్శకత్వం, నటన, రచన..సాహిత్యం..వ్యాఖ్యానం.. విశ్లేషణ..ఇలా అనేక రంగాల్లో అపారమైన ప్రతిభాపాటవాలతో బహుముఖ ప్రజ్ఞా వంతునిగా తనకు తనే సాటి అనిపించు కున్నారు.

### బుల్లితెరపై కూడా బాలు ముద్ర

వెండితెరపైనే కాదు.. బుల్లితెరపై కూడా తన విశేషమైన ముద్ర వేసుకు న్నారు. ఎక్కడ పాట కచ్చేరీ చేయాల్సి వచ్చినా ఏమాత్రం వెనుకాడేవారు కాదు. నిరంతరం అలుపు సొలుపు లేకుండా ఎంతెంతో దూరం వెళ్ళేవారు. దేశవిదేశాల పర్యటనలతో ఎప్పుడూ ఎంతో బిజీగా ఉండేవారు. పాడుతా తీయగా, ఎందరో మహానుభావులు..స్వరాభిషేకం వంటి అనేక సంగీత కార్యక్రమాలను సకలజన రంజకంగా నిర్వహించిన ఘనత ఒక్క బాలు గారిదే. పాటకు, భాషకు పట్టం కట్టడమే కాక, ప్రపంచవ్యాప్తంగా వేలాది మంది వర్ధమాన గాయనీగాయకులను తీర్చి దిద్ది సంగీత గురువుగా ఎనలేని ఖ్యాతిని పొందారు. ఇలా అనేక విధాలుగా తరతరాలకు తరగని ఆస్తిగా అశేషప్రజా నీకం కోసం పాటల్ని పండించి రాశులు పోశారు. భరతమాత ముద్దుబిడ్డగా అందరి ప్రశంసలు అందుకున్నారు. తన గానప్రస్థా నాన్ని విజయవంతం చేసుకున్న ధన్యజీవి ఆయన. అంతేకాదు సమాజానికి తనవం తుగా అనేకవిధాలుగా సేవలందిస్తూ మాన వీయమూర్తిగా.. సమాజసేవాపరా యణునిగా కూడా జీవితాన్ని పండించు కున్న పుణ్యమూర్తి ఆయన!..ఆ కీర్తిమూర్తి కివే నివాళులు!...



# ఎంజిఆర్ సినిమాలో బాలు పాట

## తమిళ చిత్రసీమలో సంచలనం

ప్రఖ్యాత తమిళ నటుడు ఎంజిఆర్ నటించిన 'అడిమై పెణ్' (తెలుగులో ఈ చిత్రం 'కొండవీటి సింహం'పేరుతో వచ్చింది. చిత్రంలో బాలు పాట పాడే మహదవకాశం వచ్చింది. తీరా పాట పాడే సమయా నికి ఆరోగ్యం బాగా లేకపోయినా, ఎంజిఆర్ ఆయనకు ఆ అవకాశం చేజారిపోకుండా ఆరోగ్యం కుదుటపడ్డాక పాడే అవకాశం ఇవ్వడంతో బాలు ఆనందం అంతా ఇంతా కాదు. 'ఆయిరం ఇలవే వా' అనే పాటను బాలు అత్యద్భుతంగా గానం చేయడంతో ఎంజిఆర్ మురిసి పోయారు. స్వయంగా ఎంజిఆర్ ప్రెస్‌మీట్ ఏర్పాటుచేసి బాలు పాటను మెచ్చుకున్నారు 'ఈ అబ్బాయి చాలా బాగా పాడుతున్నాడు. నేను నటించే చిత్రాల్లో ఈ అబ్బాయితో కనీసం ఒక్క పాటనైనా నాకు పాడించండి' అని నిర్మాతల్ని కోరారు. దీంతో బాలు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. 'సారీ సర్, నాకు టైఫాయిడ్ జ్వరం రావడంతో పాట రికార్డింగ్‌కు రాలేక పోయాను' అంటూ వినమ్రంగా బాలు చెప్పడంతో ఎంజిఆర్ "ఆ పాటను నేను మూడు వారాల క్రితమే మరొకరి చేత పాడించుకునేవాణ్ణి. అయితే నువ్వు నాకు పాడుతున్న విషయాన్ని పదిమందికీ చెప్పుకుని ఉంటావు. ఆ పాట మరొకరు పాడితే.. నీ పాట నచ్చక మరొకరిచేత పాడించుకుని ఉంటారనే అపవాదు వస్తుంది. అది నాకు ఇష్టం లేదు. నీ పాట గురించి నా షూటింగ్ వాయిదా వేసుకున్నానని సినిమా పరిశ్రమ వారికి తెలిస్తే.. అది నీ భవిష్యత్తుకు బంగారు బాట అవుతుంది. ఆరోగ్యం జాగ్రత్త".. అని చెప్పడంతో ఎంజిఆర్ వంటి సుప్రసిద్ధ నటుడు తనను అభిమానిస్తూ అలా చెప్పడంతో... బాలు కళ్ళల్లో కన్నీరు తొణికిసలాడింది. బాలు పాడిన ఆ పాట సూపర్‌హిట్ కావడమే కాక..తమిళ చిత్రరంగంలో సంచలనం సృష్టించింది. మరో విశేషం ఏమిటంటే, బాలు పాడిన ఆ 'ఆయిరం నిలవే వా' అనే పాటకు తమిళనాడు ప్రభుత్వం 'ఉత్తమ గాయకుని'గా పురస్కారం ఇచ్చి బాలును ఘనంగా సత్కరించింది కూడా. ఎంతటి అదృష్టమో కదా!....



పిల్లలు చరణ్, పల్లవి... తల్లిదండ్రులు, కుటుంబసభ్యులతో బాలు

# బాలుకు ప్రీతిపాత్రమైన.. చరణ్, పల్లవి

గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం గారిది ఎంతో ఆత్మీయమైన అనురాగాల కుటుంబం. బాలు గారి సతీమణి పేరు సావిత్రి. వీరి వివాహం విశాఖపట్నం సమీపంలోని సింహాచలంలో శ్రీ వరాహలక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో వీరి వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. పాటకు పల్లవి ప్రాణం. చరణం ప్రధానం. అందుకే బాలు గారు తన పిల్లలకు చరణ్ అని, పల్లవి అని పేర్లు పెట్టుకున్నారంటే ఆయనకు పాటల మీద ఎంత ప్రేమ ఉందో ఊహించుకోవచ్చు. బాలు తనయుడు ఎస్పీ చరణ్ గాయకుడిగా, చిత్ర నిర్మాతగా కూడా ఉన్నారు. బాలు సోదరీమణులు ఎస్పీ శైలజ, వసంత కూడా సుప్రసిద్ధ గాయనీమణులే కావడం విశేషం. వీరిదంతా సంగీత కుటుంబం. బాలు తండ్రిగారు ప్రఖ్యాత హరికథా గాన కళాకారుడే కాక, నెల్లూరులో భిక్షాటనాపూర్వక త్యాగరాజ స్మరణోత్సవ సభ ద్వారా సంగీతోత్సవాలను న భూతో న భవిష్యతి అనే రీతిలో జరిపించి త్యాగరాజ భిక్షువుగా పేరొందారు. తండ్రి గారు దివంగతులయ్యాక ఆయన అప్పట్లో స్థాపించిన ఆ సభ కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరుగుతూ ఉండాలని బాలు ఆకాంక్షిస్తూ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఆ సంగీతోత్సవాలకు తనవంతు చేయూతనివ్వడమే కాక, ఆ సభకు శాశ్వత అధ్యక్షునిగా కూడా కడదాకా కొనసాగి తన తండ్రి పట్ల, సంగీతం పట్లా తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు.



ఇద్దరు మలయాళీలు కలిస్తే మలయాళం మాట్లాడుకుంటారు. ఇద్దరు తమిళులు కలిస్తే తమిళమే మాట్లాడుదారు.
అదేం ఖర్మమో ఏమో.. ఇద్దరు తెలుగువాళ్ళు కలుసుకున్నపుడు తెలుగు భాష మాట్లాడడానికి తెగ మొహమాట పడుతుంటారు.

**బాలు మాట... బంగారు బాట**

## మౌనం దాల్చిన పాట

**పా**ట మౌనం దాల్చింది
భువన భవన
విశ్వాంతర సోపానాల్లోకి
పాట ఎగిరిపోయింది.

శతకోటి కోయిలల గొంతుల్ని
మూగస్వరాలు చేసి
సోమయాజి పుట్టిన నేలలో
గానయాజిగా జన్మించిన పాట
పదహారు భాషల్లో
జిహ్వాలపై నృతించి
జాతీయ సమైక్యత
జెండా ఎగరేసినపాట
పల్లవికి, చరణాలకి
పదనిసల ప్రాణం పోసిన పాట
ఎందరెందరో గాయకుల గొంతుల్లో
ప్రాణప్రతిష్ఠ జరుపుకున్న పాట
నటనకి నవరసాల
స్వరాలు పలికిన పాట
పినాకినీ ప్రవాహ గీతానికి
జతులు కలిపిన పాట
కాళిదాస కళాసమితిలో
పల్లవించిన పాట
గీతానికీ సంగీతానికీ
జుగల్బందీ కూర్చిన పాట
సామాన్యుడి నోట
శంకరాభరణమై పలికిన పాట
పదాలకి నవరసామృతం
రంగరించిన పాట
లింగాష్టకాన్ని
నింగిలో నిలిపిన పాట
దేవీ దేవతల్ని
భువికి దింపిన పాట
ఎన్నో పాత్రలకి గాత్రదానం
చేసి చేసి అలసి సొలసి
విశ్వాంతర వినువీధుల్లోకి
రెక్కలు కట్టుకుని
తరలిపోయింది పాట!



**ఈతకోట సుబ్బారావు**
94405 29785.

### నెల్లూరులో సంగీత దర్శకుడు సాలూరు వాసూరావు కుమారుని పెళ్ళి వేడుకలో

# తన సహచర సంగీత దిగ్గజాలతో... బాలు మధుర జ్ఞాపకాలు

## చివరిసారిగా బాలు తన జన్మస్థలానికి వచ్చిన సందర్భం ఇదే



అందరూ ఆయనకంటే చిన్నవాళ్లు, అందరూ అయన దగ్గర ఓనమాలు నేర్చు కున్నవాళ్ళే, ఇప్పుడు అందరు ప్రముఖులే సంగీత దర్శకులుగా పేరు ప్రఖ్యాతులు పొంది తమకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నవాళ్ళే , వాళ్లంతా బాలుగారిని ఒకే చోట కలిసే అరుదైన అవకాశం వారికి దక్కింది, అయితే అటు బాలుగారికి ఇటు వీరందరికీ అదే చివరి జ్ఞాపకం కావడం బాధాకరం. 2020 ఫిబ్రవరి 25, 26వ తేదీల్లో సుప్రసిద్ధ సంగీత దర్శకులు సాలూరి వాసురావు గారి కుమారుడి పెళ్లి నెల్లూరులో జరిగింది. ఈ వివాహ వేడుకకు సినీ సంగీత దిగ్గజాలందరు హాజరయ్యారు, పెళ్లి రోజుకి ముందు రోజు జరిగిన రిసెప్షన్ విందులో వీళ్లంతా కలసి పాల్గొన్నారు. సంగీత దర్శకులు మాధవ పెద్ది సురేష్, మణిశర్మ, తమన్, కోటి లతోపాటు శివమణి కూడా వీరితో వున్నారు. వీరందరితో కలిసి పాత జ్ఞాపకాలను బాలు పంచుకున్నాడు, వారితో ఆడాడు, పాడాడు, హాయిగా నవ్వుకున్నాడు ఆనందంగా ఆ రాత్రి గడిపాడు. అయితే బాలుగారితో వాళ్ళు గడిపే చివరి క్షణాలు ఇవే అని ఆరోజు వాళ్ళూ అనుకోలేదు, తన జన్మభూమిలో తనకు ఇవే చివరి గుర్తులని అయనా అనుకోలేదు. ఆ తరువాత మళ్ళీ బాలు నెల్లూరికే రాలేదు. ఆ రోజు జరిగిన విందులో బాలు సంగీత బృందంతో పాటు అయన ఆత్మీయులుగా శాంతా బయోటిక్స్ అధినేత వరప్రసాద్‌రెడ్డి, లాయర్ పత్రిక సారధి శివప్రభాత్‌రెడ్డి, మురళీకృష్ణ హోటల్స్ యం.డి హజరత్ బాబు తోపాటు బాలు చిన్ననాటి మిత్రులు , ఆప్తులు ఆత్మీయులందరికి పాల్గొనే మహత్ భాగ్యం కలిగింది.





సంగీత దిగ్గజాలతో వరప్రసాద్‌రెడ్డి, శివప్రభాత్‌రెడ్డి

మరుసటి రోజు ఉదయం ఫిబ్రవరి 26న జరిగిన వివాహ వేడుకలో కూడా బాలు చాలామంది సినీ ప్రముఖులను, సినీ, సాహిత్య రంగాలతో పాటు ఇతర అనేక విభాగాలలో పనిచేసే పరిచయస్తులను, సన్నిహితులను బంధుమిత్రులను కలుసుకున్నాడు. ఇదే చివరికి కలయిక కావడంతో ఇప్పుడు అందరూ కన్నీరు మున్నీరవుతున్నారు. వాసురావు కుమారుని పెళ్లి అందరికీ బాలుతో తీపి జ్ఞాపకాలను మిగిల్చింది.





ఈ ఆధునిక యుగంలో ఇంగ్లీషు నేర్చుకోవడం తప్పనిసరి. భాషపై మంచిపట్టు సంపాదించండి. అవసరమున్న చోట చక్కగా మాట్లాడండి. దాని అవసరం లేనిచోట మన మాతృభాషకు ప్రాముఖ్యత ఇవ్వండి. లేకుంటే కొన్నాళ్లకు తీయనైన తెలుగుభాష పూర్తిగా మరుగున పడే ప్రమాదం ఉంది!

బాలు మాట... బంగారు బాట

# విపిఆర్‌పై పాట

- ఎల్లలు దాటిన అభిమానం
- వేమిరెడ్డిపై ఆలపించిన ఆత్మీయ గానం



అపర దానకర్ణుడు, నిరంతర సేవాతత్పరుడు, ఇప్పుడు రాజ్యసభసభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి అంటే బాలసుబ్రహ్మణ్యంకి వల్లమాలిన అభిమానం, ఆయన చేసిన, చేస్తున్న సేవా కార్యక్రమాలను తరచూ ప్రస్తావిస్తూనే ఆయనను కీర్తిస్తూ ఉండేవాడు. 2013 అక్టోబర్‌లో జరిగిన విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన తన కుటుంబ సమేతంగా వచ్చి తన సంగీతంతో నెల్లూరీయులను వీనుల విందు చేశాడు.

2018లో అమెరికాలో జరిగిన నాట ద్వైవార్షిక సంబరాలలో వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి జీవితసాఫల్య పురస్కారం అందుకోనున్న సందర్భంలో ప్రభాకరరెడ్డిపై 'లాయర్' పత్రిక సబ్‌ఎడిటర్ మద్దూరు శ్రీనివాసులు రాసిన "లోకాన ఉదయించే తొలి కిరణం సూర్యునిదే – సేవాభావాన పులకించి తొలి హృదయం ప్రభాకరునిదే" అన్న పాటకు సుప్రసిద్ధ సంగీత దర్శకులు మాధవపెద్ది సురేష్ చేత స్వరకల్పన చేయించి బాలుగారే స్వయంగా పాడారు. ఆయన 50 సంవత్సరాల సినీ సంగీత జీవితంలో ఒక వ్యక్తిపై ఆయన పాట పాడడం అదే ప్రథమం. ఆ అవకాశం, అదృష్టం విపిఆర్‌కి దక్కింది. అమెరికాలో కొన్ని వేలమంది తెలుగువారి సమక్షంలో విపిఆర్ జీవిత విశేషాలతో రూపొందించిన లఘు చిత్రం ప్రదర్శన సమయంలో ఈ పాట అందరినీ ఆకట్టుకుంది. విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ ప్రారంభోత్సవంలోనూ, అమెరికాలో అవార్డు ప్రాధానోత్సవ వేడుకల్లోనూ 'లాయర్'ది కీలక పాత్ర.

విపిఆర్‌కి అవార్డు వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని అనంత్ కళాంజలి తమ రజతోత్సవ వేడుకగా నిర్వహించిన విపిఆర్ అభినందన సంబరంలో బాలుగారే ముఖ్య అతిథిగా పాల్గొని ప్రభాకరరెడ్డిని ప్రశంసలతో ముంచేశాడు.




# స్వచ్ఛ సంగీతం



- స్వచ్ఛ సంగీతంతో స్వచ్ఛభారత్‌కి స్ఫూర్తి
- తన నాన్న విగ్రహావిష్కరణతో నెల్లూరుకు దీప్తి
- 'ఇదీ సాంబమూర్తి గారి కథ'తో లాయర్‌కి కీర్తి

స్వచ్ఛభారత్ బ్రాండ్ అంబాసిడర్‌గా తనను నియమించి భారత ప్రభుత్వం బాల సుబ్రహ్మణ్యంపై పెట్టిన నమ్మకాన్ని ఆయన వమ్ము కానీయలేదు. తనతో పాటు మరో బ్రాండ్ అంబాసిడర్ హీరో కమలహాసన్‌ను అక్టోబర్ 3వతేదీ 2015న నెల్లూరుకు తీసుకు వచ్చి నగరంలో విఆర్‌సి మైదానం నుండి పోలీస్ కవాతు మైదానం వరకు 15000మందితో స్వచ్ఛభారత్ అవగాహనా ర్యాలీచేసి అదే పోలీస్ కవాతు మైదానంలో "స్వచ్ఛ సంగీతం" పేరుతో స్వచ్ఛమైన సంగీతాన్ని నెల్లూరీయులకు తన సహచర బృందంతో వినిపించాడు.


స్వచ్ఛభారత్ ర్యాలీలో ఆనాటి కలెక్టర్ జానకితో బాలు


సాంబమూర్తి గారి విగ్రహావిష్కరణ కార్యక్రమం


లాయర్ 'ఇదీ సాంబమూర్తి గారి కథ' ఆవిష్కరణ

ఈ సందర్భంగా బిక్షాటనా పూర్వక త్యాగరాజ సంస్మరణోత్సవాలకు ఆద్యులు, తన తండ్రి శ్రీపతి పండితారాధ్యుల సాంబ మూర్తి గారి విగ్రహాన్ని శ్రీ వెంకటేశ్వర కస్తూరిబా కళాక్షేత్రంలో అయన తన తల్లి శ్రీమతి శకుంతలమ్మ చేతులమీదుగా ఆవిష్కరింపచేశాడు. ఈ కార్యక్రమంలో ఆనాటి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖా మాత్యులు వెంకయ్యానాయుడు, సుప్రసిద్ధ దర్శకులు కె.విశ్వనాథ్, నటుడు కమలహాసన్‌తో పాటు వేలాదిమంది బాలు అభిమానులు, కుటుంబ సభ్యులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

న భూతో న భవిష్యత్‌లా జరిగిన ఈ వేడుకలో బాల సుబ్రహ్మణ్యం తండ్రిగారి జీవిత విశేషాలను "ఇదీ సాంబమూర్తి గారి కథ"గా నెల్లూరీయులకు అందించే మహత్ భాగ్యం 'లాయర్' పత్రికకి దక్కింది. ఈ కార్యక్రమం నిర్వహణ మొత్తం బాధ్యతని బాలుగారు 'లాయర్'పై పెట్టారు బాలుగారు. 'లాయర్' చరిత్రలో ఒక చిరస్మరణీయ రోజుగా అక్టోబర్ 3,2015 నిలిచిపోయింది.




**బాలు మాట... బంగారు బాట**

పాట పట్ల నా దృక్పథం ఎప్పుడూ ఒక్కటే. పాటను పవిత్రంగా భావిస్తాను. మైక్రోఫోన్ ముందు దండం పెట్టుకుని, పాట కాగితాన్ని కళ్ళకద్దుకుని, మా గురువుగారిని తలుచుకుని మరీ పాట మొదలెడతాను. నాకు పాటే పాడే ఓపికున్నంతవరకూ నా దృక్పథం ఇదే.



# జూన్ 4న జన్మదినం.. నెల్లూరుకు పర్వదినం

- టౌన్‌హాలులో బాలసుబ్రహ్మణ్యం అవార్డుల వీచిక
- ప్రభు ఇంట్లో ఆత్మీయుల నడుమ పుట్టినరోజు వేడుక

ఇన్ని దశాబ్దాల ప్రయాణంలో నిరంతరం సంగీత సామ్రాజ్యంలో ఒక విహంగంలా విహరిస్తూ, సంగీత ప్రియులను అలరించడంలోనే తన జీవితాన్ని సాగించిన బాలసుబ్రహ్మణ్యం తొలినాళ్లలో తనపుట్టిన రోజునాడు ఎవరికీ అందుబాటులో ఉండేవాడు కాదు. కోట్లాదిమంది అభిమానులను తన సొంతం చేసుకున్న ఆయన ఒక్క పుట్టినరోజున మాత్రం తన ప్రాణమిత్రులకు కుటుంబసభ్యులకు మాత్రమే అందుబాటులో ఉండేవాడు. అయితే 1975 నుండి 1985 వరకు మాత్రం సినీసంగీత వినీలాకాశంలో ధృవతారలా వెలిగిపోతున్న తరుణంలో చెన్నైలోని బాలు మిత్రుడు, సినీ నిర్మాత జయకృష్ణకు చెందిన వ్యవసాయ క్షేత్రం (ఫామ్‌హౌస్)లో ప్రతీయేటా తన పుట్టినరోజును ఆర్భాటంగా చేసుకునేవాడు. అప్పట్లో తెలుగు సినీరంగం మదరాసులోనే ఉండడంతో అటు తమిళం ఇటు తెలుగు సినీపరిశ్రమకు చెందిన ప్రముఖులంతా అయన పుట్టిన రోజు పండుగలో పాల్గొనేవారు. సినీ దర్శకులు జంధ్యాలకు హాస్య నటుడు బ్రహ్మానందం పరిచయం అయ్యింది కూడా ఒకానొక బాలు పుట్టినరోజు పార్టీలోనే అని అయన మిత్రులు చెప్తుంటారు. తెలుగు పరిశ్రమ హైదరాబాదుకు తరలిపోవడం, ఒక్కొక్కరుగా తమ మకాంను హైదరాబాదుకు మార్చుకోవడంతో తరువాత కాలంలో మళ్ళీ జన్మదినాన్ని కేవలం కొద్ది మంది పాత మిత్రులు కుటుంబ సభ్యులకే పరిమితం చేశాడు బాలు.

2016 జూన్4 నుండి అయన మళ్ళీ ఆ పద్ధతిని మార్చుకున్నాడు. ఇకపై తన ప్రతి పుట్టినరోజు నెల్లూరులో జరుపుకోవాలని నిర్ణయించుకున్నాడు. అయితే ఆయనను సత్కరించుకోవాలని ఎప్పటినుండో ఆయనను ఆహ్వానిస్తున్న తాను పుట్టిన కోనేటంపేట గ్రామస్తుల కోరిక తీర్చడానికి ఆ యేడాది తన పుట్టిన రోజును వారికి అవకాశంగా కల్పించాడు. 2016 జూన్ 4న ఆయన 70వ పుట్టిన రోజును గ్రామస్తుల మధ్య జరుపుకున్నాడు. అక్కడ వారి ఆధరణా? ఆప్యాయతా చూసి అయన మురిసిపోయాడు. ఆ యేడాది మాత్రం నెల్లూరులో తన పుట్టినరోజును జరిపే బాధ్యత తన మిత్రులకు అప్పజెప్పాడు, బాలు హాజరు కాకపోయినా ఆయన మిత్రులు నెల్లూరులో ఆడంబరంగా బాలు 70వ పుట్టినరోజును జరిపి సాలూరు రాజేశ్వరరావు గారి కుమారుడు సాలూరు వాసురావుని ఘనంగా సత్కరించారు. ఇక అక్కడినుండీ ఇక ప్రతీ ఏటా తన జన్మదినాన్ని నెల్లూరులోనే జరుపుకోవాలని నిర్ణయించుకున్న బాలు... “ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం జాతీయ అవార్డు” పేరుతో ఒక అవార్డును నెలకొల్పి ప్రతీ ఏటా భారతీయ సినీరంగం నుండి ఒక విశిష్ట వ్యక్తిని ఎంపికచేసి ఈ అవార్డును తన జన్మభూమిలో అందజేయాలన్నది ఆయన ఆకాంక్ష. అనుకున్నదే తడవుగా 2017లో తొలిసారిగా అయన తన పుట్టిన రోజును నెల్లూరు పురమందిరంలో జరుపుకుని ప్రముఖ గాయనీమణి వెంకటగిరి కోడలు శ్రీమతి రావు బాలసరస్వతికి తొలి అవార్డును జూన్ 4వతేదీ తన 71వ పుట్టినరోజు కానుకగా అందజేశాడు.



రావు బాలసరస్వతికి నమస్కరిస్తూ...



జానకమ్మకు పాదాభివందనం

1963లో గూడూరులోని కాళిదాస కళానికేతన్‌లో పాడినప్పుడు తన పాటను మెచ్చుకుని “సినిమాల్లో ప్రయత్నం చెయ్యి పైకొస్తావు” అని తనకు ప్రేరణ కల్పించిన ప్రముఖ గాయనీమణి శ్రీమతి ఎస్.జానకికి తన రెండవ జాతీయ అవార్డును 2018 జూన్ 4న నెల్లూరు పురమందిరం ప్రాంగణంలోని బహిరంగ వేదికపైన అందచేశాడు. అదే సందర్భంలో వచ్చే ఏడాదినుండి సినీ రంగంతో పాటు జాతీయ స్థాయిలో సామాజిక సేవలో పునీతులవుతున్న వారిని కూడా ఎంపిక చేసి ఒక అవార్డు ఇస్తామని ప్రకటించాడు.

2019లో ఈ అవార్డును సీనియర్ సినీనటుడు హీరో చంద్రమోహన్‌కి అందజేశాడు. ముందు ఏడాది ప్రకటించినట్లుగానే ఈ ఏడాది సామాజిక రంగం నుండి ముంబై నగరానికి చెందిన ఆబిద్‌సూర్తిని ఎంపిక చేసి అవార్డును అందజేశాడు. డ్రాప్ డెడ్ ఫౌండేషన్ అనే సంస్థను ఏర్పాటు చేసి ఒక్క చుక్క కూడా నీటిని వృధా కానివ్వద్దు అంటూ ప్రచారం చేస్తూ నీటి విలువను సమాజానికి తెలియచేస్తున్న ఆబిద్‌సూర్తిని జూన్ 4 2019న, అదే పురమందిరంలోని బహిరంగ వేదికపైన బాలు తన అవార్డుతో సత్కరించాడు. ఇదే చివరిగా అయన నెల్లూరులో జరుపుకున్న జన్మదినం.



చంద్రమోహన్ దంపతులకు 'బాలు అవార్డు'



ఆబిద్‌సూర్తికి 'బాలు అభినందన అవార్డు'



## ప్రభు ఇంట్లో ఆత్మీయ వేడుక....

పురమందిరంలో సంబరం ముగిశాక, మాగుంట లే అవుట్‌లోని 'లాయర్' నివాసానికి కార్యక్రమంలో పాల్గొన్న అతిధులు, బాలు చిన్నబ్బయ్యా పిలుచుకునే వరప్రసాద్‌రెడ్డి గారితో సహా అయన ప్రాణస్నేహితులందరు చేరుకునే వారు, కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొని తమ పాత జ్ఞాపకాలన్నీ నెమరువేసుకుని, మాట్లాడుకుంటూ, పాటలుపాడుకుంటూ ఆనందంగా గడిపే వారు, ఏ పాపిష్టి కళ్ళు పడ్డాయో ఇప్పుడా ఆనందమంతా దూరమై అంధకారం మిగిలింది.



2019లో ఈ అవార్డును సీనియర్ నటుడు కైకాల సత్యనారాయణకు ఇవ్వాలనుకున్నాడు, అలాగే సామాజిక రంగం నుండి ఒక వీర జవాన్‌ను ఎంపిక చేసి అవార్డును ఇచ్చి భారత దేశంకోసం సైన్యం చేస్తున్న త్యాగాలను రేపటి తరానికి తెలియచేయాలనుకున్నాడు.

నెల్లూరులో మరోసారి స్వచ్ఛత శుభ్రత గురించి అవగాహనా కార్యక్రమాన్ని ఏరాటు చేసి రేపటిపౌరులును చైతన్యవంతుల్ని చెయ్యాలని పదే పదే చెప్పేవాడు, కరోనా కారణంతో ఈ ఏడాది పుట్టిన రోజును ఇంటికే పరిమితం చేసుకున్నాడు, వేడుక జరగలేదు అవార్డులు ఇవ్వలేదు, చైతన్యం కల్పించలేదు ఇవేమీ జరక్కుండానే తొందరపడ్డాడు భగవంతుడితో ఐక్యమైపోయాడు మన బాలు.






ప్రతి బిడ్డకూ తమ తల్లిదండ్రులే దైవ స్వరూపాలు. ఏ బిడ్డ తల్లిదండ్రులూ మరో బిడ్డ తల్లిదండ్రుల్లా వుండరు. కానీ, ఈ దేశం మట్టివాసన అందించిన సౌభాగ్యం ప్రతి తల్లిదండ్రులకీ గుడి కట్టి పూజించే సంస్కారం. అలాంటి ఉత్కృష్టమైన మాతాపితరులకు బిడ్డనవడం పూర్వజన్మ సుకృతం.

**బాలు మాట... బంగారు బాట**

# బాలుతో నెల్లూరీయుల తీపి జ్ఞాపకాలు




నాటి కేంద్ర మంత్రి వెంకయ్యనాయుడు గారి ఆధ్వర్యంలో 2015 ఏప్రిల్ 25న విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన 'నెల్లూరు నెక్స్ట్' కార్యక్రమంలో దేశం నలుమూలల నుండి వచ్చిన నెల్లూరు ప్రముఖులతో యస్.పి.బాలసుబ్రహ్మణ్యం



2016, డిసెంబర్ 10న దుబాయ్‌లో జరిగిన మీట్ & గ్రీట్‌లో దుబాయ్‌లో ఉన్న నెల్లూరీయులతో యస్.పి.బాలసుబ్రహ్మణ్యం



స్వర్ణభారత్ ట్రస్ట్‌లో బాలును సత్కరిస్తున్న దీపావెంకట్



2003 ఆగస్టు 5న డా॥ బెగోరె అవార్డును అందుకున్న యస్పీ బాలు



నాగభైరవ అవార్డు సభలో మల్లెమాలతో బాలు



నాగభైరవ అవార్డు సభలో చిన్ని నారాయణరావుతో బాలు



బంధుమిత్రులతో నెల్లూరులో బాలు



2019 జూన్ 4న తన పుట్టినరోజు నాడు వాత్సల్యలో ఆహారవితరణ చేస్తున్న బాలు



వాత్సల్యలో బాలును సత్కరిస్తున్న రావి మోహన్‌చౌదరి



విజేత ఆర్ట్స్ ఆధ్వర్యంలో నెల్లూరులోని బాలు ఇంట్లో జరిగిన సంతాప సభలో నివాళులర్పిస్తున్న సంస్థ సభ్యులు, బాలు ఆప్తులు, అభిమానులు



యస్.పి.బాలుకు నివాళులర్పిస్తున్న ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సభ్యులు



బాలు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గూడూరు బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు

బాలు మాట...
బంగారు బాట

మార్పు.అనేది సర్వసాధారణం. పాత కొత్త అనే తేడా లేదు. అయితే ఆ మార్పు వింతపోకడలకు పోకూడదు.
వినడానికి సొంపుగా లేనిదేదీ సంగీతం కాజాలదు.



- శోకసాగరంలో నెల్లూరు

# 'బాలు'డై వచ్చాడు.. భువనానికి దేవుడై పోయాడు.. గగనానికి



***గత 54 సంవత్సరాలుగా సినీ సంగీత రంగంలో అద్భుతాలను సృష్టించి, దాదాపు 50వేలకు పైగా పాటలు పాడి తన అమృతగానాన్ని విశ్వవ్యాప్తం చేసిన శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం అనారోగ్యంపాలై ఆగస్టు 5వ తేదీ నుండి సెప్టెంబర్ 25వ తేదీ వరకు 50రోజుల పాటు ఆసుపత్రిలో చికిత్స పొంది 25వ తేదీ మధ్యాహ్నం 1.04 నిముషాలకు తుదిశ్వాస విడిచారు. ఆగస్టు 5న ఆసుపత్రిలో చేరిన ఆయన తనకేమీ కాదని, త్వరలోనే వచ్చేస్తానని వీడియో సందేశం ద్వారా అందరికీ తెలియజేసి, అంతలోనే అందనంత దూరాలకు వెళ్లిపోవడం అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. బాలసుబ్రహ్మణ్యం ఇక లేరనే సమాచారంతో నెల్లూరు శోకసాగరంలో మునిగిపోయింది. బిడ్డను కోల్పోయిన తల్లిలా సింహపురి సీమ గుండె విలవిల్లాడిపోయింది. బాలుకు నెల్లూరంటే ప్రాణం. నెల్లూరులో ఆయనెన్నో అపూర్వమైన కార్యక్రమాలను కూడా నిర్వర్తించారు. తన పాటతో, తన మాటతో నెల్లూరు యాస భాషలతో నెల్లూరుకు సాటిలేని కీర్తిని తెచ్చిన...బాలు మరణంతో నెల్లూరు శోకసాగరంలో మునిగిపోయింది.***

తన మధురాతి మధురమైన గాత్రంతో కోట్లాదిమంది హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న బాలు మృతిచెందారని తెలియ డంతో, నెల్లూరుతో ఆయనకున్న ఆత్మీయ తానుబంధాన్ని తలచుకుని నెల్లూరీయులు భాధాతప్త హృదయాలతో కన్నీరు పెట్టు కున్నారు. చిత్తూరుజిల్లాలోని కోనేటంపేట లోని అమ్మమ్మ ఇంట్లో తాను జన్మించినా, ఆయన చిన్నతనమంతా నెల్లూరులోనే గడిచిపోయింది. ఆయన కేరింతలు, తుళ్ళింతలు అన్నీ నెల్లూరులోనే. బాలు తండ్రి శ్రీపతి పండితారాధ్యుల సాంబ మూర్తి గారు. బాలు మాతృమూర్తి శకుంతలమ్మ. ఈ పుణ్యదంపతులు నెల్లూరు లోనే స్థిరనివాసం ఏర్పరచుకోవడంతో బాలు ఎంతో కాలం నెల్లూరులోనే ఉన్నారు. ఆయన ఎప్పుడూ తన జన్మభూమి నెల్లూరుగానే చెప్పేవాడు. మన నెల్లూరీయుడుగా ఆయనెంతో సగర్వమైన రీతిలో ఎదిగారు. అనుక్షణం పరిశ్రమిస్తూ అకుంఠిత సాధనతో, అనితర సాధ్యమైన ప్రతిభా పాటవాలతో ఆయన ముందుకుసాగారు. సంగీతంలో మెళవకువలు తెలుసుకుంటూ చిత్రపరిశ్రమలో నేపథ్యగాయకునిగా రంగప్రవేశం చేసి.. తన గానామృతంతో జాతీయస్థాయిలోనే కాక.. ప్రపంచప్రఖ్యాతిని సంపాదించుకున్నారు. మన బాలు.. మనమధ్య తిరిగిన బాలు.. మనతో కలిసి పెరిగిన బాలు.. ఇక లేడని తెలియడంతో నెల్లూరు శోకసముద్రంలో మునిగిపోయింది.

## బాలు మరణం దిగ్భ్రాంతి కలిగించింది

**- భారత ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు**

ప్రముఖ నేపథ్య గాయకుడు, ఐదున్నర దశాబ్దాలుగా తమ అమృత గానంతో ప్రజలను అలరింపజేసిన శ్రీ శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్ర హ్మణ్యం గారు అనారోగ్య కారణాలతో పరమపదించడం దిగ్భ్రాంతి కలిగించిందని ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. వారు అనారోగ్యం పాలయ్యారని తెలిసినప్పటినుంచి వైద్యులతో రోజూ మాట్లాడుతూ.. ఎప్పటికప్పుడు వారి ఆరోగ్య పరిస్థితిని వాకబు చేస్తూ వచ్చానని, వారి కుమారుడితో మాట్లాడి కావాల్సిన సలహాలు ఇస్తూ వైద్యులకు సూచనలు చేస్తుండేవాడినని వెంకయ్య పేర్కొన్నారు. వారు కోలుకుంటున్నారని భావిస్తున్న తరుణంలోనే ఇలా జరగడం విచారకర మని, వివిధ భారతీయ భాషల్లో ఎన్నో పాటలకు ప్రాణం పోసిన బాలు వేలాది యువ తెలుగు గళాల్ని వెలుగులోకి తీసుకొచ్చారని పేర్కొన్నారు. ఆయనకు ఇలా జరగడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ వారి కుటుంబసభ్యులకు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తు న్నానంటూ వెంకయ్య తన సంతాప సందేశంలో తెలిపారు.

## నెల్లూరు ప్రముఖుల సంతాపం

రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇరిగేషన్ మంత్రి అనిల్, బాలు అంత్య క్రియల్లో పాల్గొని నివాళులర్పించాడు. అలాగే మరణవార్త తెలిసిన వెంటనే ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి, 'లాయర్' సంపాదకులు ప్రభు చెన్నైలోని బాలు నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. భారతీయ సినిమా సంగీత రంగం ఒక అద్భుతమైన గళాన్ని కోల్పోయిందని మంత్రి గౌతంరెడ్డి, రాజ్యసభసభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పార్లమెంటు సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, శాసనసభ్యులు ఆనం రామనారాయణరెడ్డి, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, రత్నం విద్యాసంస్థల అధినేత కె.వి.రత్నం, మాజీమంత్రి నారాయణ, విశ్వసాయి విద్యాసంస్థల డైరెక్టర్ సత్యనారాయణ, చర్మవ్యాధి నిపుణులు డా॥ నాగార్జున, స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపావెంకట్, కాంగ్రెస్ నాయకులు చేవూరు దేవకుమార్‌రెడ్డి, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ప్రముఖ వధాన్యులు జె.యస్.రెడ్డి, మాజీశాసనసభ్యుడు జె.కె.రెడ్డి, శాంతా బయోటిక్స్ వరప్రసాద్‌రెడ్డితో పాటు నెల్లూరులోని పలువురు కళాసంస్థలు, కళాకారులు, సంగీత సాహి త్యాభిమానులు తదితర ప్రముఖులు తమ సంతాపాన్ని తెలియజేశారు.



రాష్ట్ర ప్రభుత్వం తరపున బాలు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పిస్తున్న మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్



బాలు పార్థివ దేహం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఒంగోలు ఎంపి మాగుంట శీనయ్య



వెళ్లిపోయారా సార్.. అంటూ విలపిస్తున్న 'లాయర్' ప్రభు





సంగీతానికి ఎల్లలు లేవు. ఎంత నేర్చుకున్నా ఇంకా ఎంతో ఉంటుంది. ఇక్క జీవితకాలం కాదు కదా ఎన్ని జన్మలెత్తినా సంగీతాన్ని పూర్తిగా నేర్చుకోవడమనేది ఎవరివల్లా సాధ్యం కాదు.

బాలు మాట... బంగారు బాట

# తన గళంతో... గాన యుగాన్ని సృజించిన బాలు!

**2016** మే నెల మందు వేసవి మధ్యాహ్నం మూడు గంటల వేళ... హఠాత్తుగా నా సెల్ మోగింది. అవతల్నుంచి గానగంధర్వుడి పలకరింపు! సాంబమూర్తి గారి జీవిత చరిత్ర క్రమపద్ధతిలో అక్షర బద్ధం అయ్యి పుస్తకంగా వెలువడితే బాగుంటుంది – అన్న నా సంకల్పాన్ని నాకు ప్రాణ సమానుడు – నేను అన్నయ్యా అని పిలిచే తనికెళ్ల భరణి ద్వారా విని – ఆనందంతో అంగీకారం తెలుపుతూ బాలూ గారు అన్న మాటలు

"ఎమ్మెస్ గారూ! నా జీవిత చరిత్ర రాయడానికి పదిమంది ఉన్నారు.. మా నాన్న గారి జీవిత చరిత్ర రచనకు మాత్రం మీరొక్కరే!" ఈ ఒక్క వాక్యం నాకు వెయ్యేనుగుల బలాన్నిచ్చింది!

నిజానికి – 2016 మే నెలలో ఒకరోజు టీవీలో శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి గారి దివ్య విగ్రహావిష్కరణ కార్యక్రమం ఆసాంతం చూసి పులకించాను. 2015 అక్టోబర్ 3న జరిగిన ఆ ఉత్సవ సౌరభాన్ని మరల ప్రసారం చేయడం వల్ల అది నా దృష్టికి వచ్చింది.

ఆ కార్యక్రమం నాలో అలజడి రేపింది. "సాంబ మూర్తి గారి విగ్రహ ఆవిష్కరణ సరే... ఆయన జీవిత చరిత్ర ఎక్కడా కనబడలేదే?" అని అనుమానమొచ్చి – నా ప్రాణసఖుడు భరణి గారికి ఫోన్ చేశా. ఆయన బాలూ ద్వారా నెల్లూరులోని సుప్రసిద్ధ వారపత్రిక 'లాయర్' వారు సాంబయ్య పైన విశేషంగా ప్రచురించిన అద్భుత వర్ణచిత్ర సంచిక 'ఇదీ సాంబమూర్తి గారి కథ' కొరియర్లో పంపారు.

నేను ఆత్రంగా మొత్తం సంచిక చదివేశాను. అయితే నా ముప్పైఏళ్ళ పైబడిన సాహిత్య జీవితంలో అనేక ప్రముఖుల జీవిత చరిత్రలు చదివి ఉన్న మీదట – నాకేమనిపించిందంటే – 'లాయర్' సంచిక చేసిన ప్రయత్నం అద్భుతమే – కానీ ఇది సమగ్రంగా లేదనిపించింది. ఇది అనేక వ్యక్తుల అనుభూతుల వీచిక! వీటిని ఏకసూత్రంతో కలుపుతూ – ఇంకా పరిశోధించి వెలువరిస్తే – బాలూ గారి కోరిక – తమ తండ్రి జీవిత చరిత ఒక పుస్తకంగా చూసుకుని – పితృ ఋణం నుంచి కొంతైనా ఉపశమనం చేసే



ఎమ్మెస్ సూర్యనారాయణ
సెల్: 9298950941

పవిత్ర ఉద్దేశ్యంతో... ఎటువంటి పారితోషికమూ ఆశించకుండా రెండు సంవత్సరాల పాటు 'హరికథా భిక్షువు' జీవనదర్శనం గ్రంథం కోసం అంకితమై – దాని పుస్తక ప్రచురణ – బుక్ లే అవుట్ – డిజైన్‌తో సహా రూపకల్పన చేసే అవకాశం బాలూ గారు నన్ను విశ్వసించి కల్పించడం – నాకు జీవిత కాలపు సాఫల్య పురస్కారంగా భావిస్తాను.

★★★★★

'హరికథాభిక్షువు' గ్రంథ రచనలో భాగంగా 2016 అక్టోబరులో రెండు రోజులు పాటు నెల్లూరులో గడపడం – తిప్పరాజువారివీధిలోని సాంబమూర్తి గారి గృహంలో గడపడం, సాంబయ్య సతీమణి, బాలూ తల్లి శ్రీమతి శకుంతలమ్మ గారి ఆశీస్సులందుకుని అంతవరకూ నేను రాసిన ఆరు అధ్యాయాలు రాతప్రతిని ఆమె చేతుల్లో ఉంచడం నాకెదురైన మరపురాని మధురమైన సన్నివేశం!

నా నెల్లూరు టూరులో వీరిశెట్టి హజరత్‌బాబు గారు నాకు సకల సౌకర్యాలూ కల్పించి, నాకు కావలసిన సమాచారాన్ని అందించడం, వీరిశెట్టి శ్రీనివాసరావు గారు, గ్రోసు గోపాలయ్య గారు, 'లాయర్' ఉపసంపాదకుడు మద్దూరు శ్రీనివాసులు తదితరులు అందించిన బలం – నా కలాన్ని కదం తొక్కించింది!

2018 మార్చి 3 నా జీవితంలో మరువలేను! బాలూ గారు, శ్రీ సిరివెన్నెల, శ్రీ వెన్నెలకంటి, వర ప్రసాద్‌రెడ్డి గారు, శ్రీ గ్రోసు గోపాలయ్య, శ్రీ వీరిశెట్టి హజరత్‌బాబు, 'లాయర్' పత్రిక సంపాదకులు శివప్రభాత్‌రెడ్డి, వీరంతా బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు గారి అధ్యక్షతన నెల్లూరు టౌన్‌హాలు త్యాగరాజోత్సవ ప్రాంగణంలో కనుల పండుగలా వేలాది ప్రేక్షకుల సమక్షంలో – బాలూ గారి తల్లి శ్రీమతి శకుంతలమ్మ చేతులమీదుగా 'హరికథా భిక్షువు' ఆవిష్కారం పారవశ్యంగా నాకు ఒక ప్రవహించే జ్ఞాపకం!

★★★★★

రెండువేలపది నుంచే బాలూ గారితో నాకు అనుబంధం ఉన్నా 2016 నుంచే అది గాఢమైన అనుభవంగా మారింది! "ఎమ్మెస్.. నువ్వు నా హృదయంలో అత్యంత కీలకస్థానంలో ఉంటావు... మా నాయన సాంబమూర్తి నీ అక్షరాభిషేకానికి పొంగిపోయి తన ఋణం తీర్చు కోవడానికి నాకు మరో జన్మ తప్పక ఇస్తాడు" అని స్వహస్తాలతో.. అపురూపమైన దస్తూరితో... యిచ్చిన ప్రశంసాత్మక దీవెన... నా జన్మను పునీతం చేస్తోంది!

గడచిన నాలుగేళ్ళలో అనేక మార్లు బాలూగారిని కలిసినప్పుడు గంటలకొద్దీ తన అమూల్య సమయాన్ని కానుక చేసిన అపూర్వ సత్కారం... ఆయనను కలిసిన ప్రతిసారీ... నన్ను... నా కోరిక మేరకు గాఢంగా కౌగిలించుకుని వీడ్కోలు చెప్పిన ఆ గంధర్వగాన స్పర్శ... తను ఆస్పత్రిలో చేరే దురదృష్ట చివరి ఘడియల వరకూ నాతో వాయిస్ మెసేజ్‌ల ద్వారా మాట్లాడుతూ – తన చిట్టచివరి ముందు మాటలు నా 'చంద్ర గీతం' పుస్తకం కోసం రాసిచ్చి... తన ప్రేమకాంతి వర్షంలో నన్ను తడిపి ముద్ద చేసిన – ప్రేమ అపూర్వం!

***శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం***
***తన గళంతో ఒక గానయుగాన్ని సృష్టించి వెళ్ళారు.***
***సమస్త ఋణాలనీ తీర్చుకుని శాశ్వతులయ్యారు.***
***ఒకసారి గంధర్వలోకం నుంచి దారి తప్పిన బాలుడు***
***తిరిగి అలాగే 'మైమరపు'తో...***
***వస్తే ఎంత బాగుంటుందీ!***

★★★★★

## బాలూ...
## నీ చేవ్రాలు మళ్ళీ కావాలి!

ఈరోజు
ఆకాశం వంగి అవనిని కన్నీళ్ళతో
అభిషేకిస్తోంది
పిల్లగాలుల తెమ్మెరలు ఉష్ణోగ్రతా
రూపాలై వీస్తున్నాయి
ధరిత్రి చరిత్రలో సరికొత్త సంగీతాధ్యాయాన్ని
సృష్టించిన
సుస్వర సంగీత శిఖరం కళ్ళ ముందే
కుప్పకూలిపోయింది.
తెలుగువారి పెన్నిధి క్షణంలో
వొలికిపోయింది.
గంగా ప్రవాహం లాంటి పాటలరేడును
విధి క్రూరంగా బలితీసుకొంది
వేలాది పాటల్ని... కోట్లాది మాటల్ని
మనకిచ్చి పారిజాతమై పరిమళించిన
పండితారాధ్యుడు 'ఇక శెలవంటూ'
వెళ్ళిపోయాడు.
సినిమా పాటకు పట్టాభిషేకం చేసిన
'జ్ఞాన' గంధర్వుడు నిష్క్రమించాడు
పాటకు ప్రాణప్రతిష్ట చేసిన
అమర గాయకుడు తరలివెళ్ళిపోయాక
ఇక పాటకు దిక్కెవరు?
దేశం దేహం నిండా మానని గాయాల
సలపరంతో తల్లడిల్లిపోతోంది
జన కన్నీటి సంద్రం భళ్ళుమన్నాక
కరోనా సైతం పశ్చాత్తాపంతో
వెక్కి వెక్కి ఏడుస్తోంది
విధి కలత చెంది తనకు తాను
దహించుకుపోతున్నది
జనమంతా అనిమిషులై
మహావిషాదంతో
బిత్తర చూపులు చూస్తున్నారు
పాటే మాటగా బాటగా నడిచే
అమృత స్వరాల బాలు దివికేగడం
భువికొక అశనిపాతం
పాటల సామ్రాజ్యాధినేత
ఆత్మాభినిష్క్రమణంతో
లోకమంతా శోకమై విలపిస్తున్నది
ఓ అన్నమయ్య,
ఓ శంకర శాస్త్రి
ఓ వెంకటేశ్వరుడు
బాలూ చేవ్రాలు
మళ్ళీ కావాలి
పాటకు సరికొత్త
ఊపిరిపోయాలి!



చిన్ని నారాయణరావు
9440202942

# తండ్రి గారి స్ఫూర్తితో..త్యాగరాజస్వామికి సేవలు

## భిక్షాటనాపూర్వక త్యాగరాజస్వామి స్మరణోత్సవాలతో బాలుకు అనుబంధం

**- యనమండ్ర నాగదేవిప్రసాద్**

నెల్లూరుసీమకే గర్వకారణం భిక్షాటనాపూర్వక శ్రీ త్యాగరాజ స్మరణోత్సవాలు. నెల్లూరును మరో తిరువయ్యార్‌గా ప్రసిద్ధిలోకి తెచ్చిన మహానుభావుడు.. భగవత్‌సేవకుడు శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి గారు.. మా తండ్రి గారైన యనమండ్ర వేంకటేశ్వరశాస్త్రిగారు. వీరిద్దరూ కలిసి ఎప్పుడో 55 సంవత్సరాల క్రితం నెల్లూరు నగరంలో త్యాగరాజ సంస్మరణ చేస్తూ సంగీతోత్సవాలు అత్యద్భుతంగా నిర్వహించడం ప్రారంభించారు. మహాగాయకులు బాలు తండ్రి గారైన శ్రీ సాంబమూర్తిగారు, మా తండ్రి గారైన వేంకటేశ్వరశాస్త్రి గార్ల ఆశీస్సులు, వారి సంకల్పబలం చేతనే అవి నేటికీ నెల్లూరులో నిర్విఘ్నంగా కొనసాగుతున్నాయి. ఈ తరంలో మేమిద్దరం ఈ బృహత్కార్యాన్ని నిర్వహిస్తుండేవాళ్ళం. బాలు గారు ఈ సంగీతోత్సవాల నిర్వహణకు ఎంతగానో సహకరించేవారు. వీలైనప్పుడల్లా ఆర్థికంగా కూడా చేయూతనిచ్చేవారు. తనకు తెలిసిన ఎంతోమంది ప్రసిద్ధ గాయనీ గాయకులును నెల్లూరు టౌన్‌హాలు ప్రాంగణంలో జరిగే త్యాగరాజ స్మరణోత్సవ సభల్లో పాల్గొనే చేసేవారు. ప్రఖ్యాత సంగీతజ్ఞులు కారుణ్య, మాస్టర్ శశాంక్, ప్రముఖ వైణికులు శ్రీరాజేష్ వైద్య తదితరుల ప్రత్యేక సంగీత కార్యక్రమాల ఏర్పాటులో బాలు గారి పాత్ర ఎంతో ప్రధానంగా ఉండేది. ప్రఖ్యాత గాయకుడు జే.ఏసుదాసు గారు, ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు శ్రీ చాగంటి కోటేశ్వరరావు గారి వంటి ప్రముఖులను నెల్లూరుకు స్వాగతించి వారిని సత్కారాలతో గౌరవించిన మహనీయులు బాలు గారు.



త్యాగరాజస్వామి స్మరణోత్సవ సభలో 'హరికథాభిక్షువు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న యస్.పి.బాలు

తండ్రి గారి స్ఫూర్తితో త్యాగరాజ స్మరణోత్సవ సభకు బాలు గారు చేసిన సేవలు ఎనలేనివి. బాలు గారు శాశ్వత అధ్యక్షులుగానూ, నేను శాశ్వత కార్యదర్శిగా కొనసాగుతుండేవాళ్ళం. రానున్న 60వ త్యాగరాజ స్మరణోత్సవ సభలు మరింత ఘనంగా చేయాలని కూడా ఆయన భావిస్తుండేవారు. ఈలోగానే ఆ మహనీయుని మరణం.. మాకు తీరని బాధను కలిగిస్తోంది. బాలు గారు మన మధ్య లేరనే మాటనే సింహపురి ప్రజలు, సంగీతాభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఆబాల గోపాలమంతా బాలుకు భారతరత్న పురస్కారం రావాలని కోరుకుంటున్నారు. ఏదేమైనా బాలు గారి లేని లోటు భిక్షాటనాపూర్వక త్యాగరాజ స్మరణోత్సవాల సభకు ఏనాటికీ తీరనిది.

## స్మృత్యంజలి

శ్రీపతి జేరెగా శ్రీపతి సన్నిధిన్
శ్రోతల హృదయాలు శోకమంద
గగనాని కెగిసింది గాంధర్వ గానమ్ము
వినిపించదా యింక వీనులలర!..

గళమున గమకాలు, కమ్మని సంగతుల్
కదలాడ చూడము కాలమహిమ
అధరమ్ము కదిలింప అద్భుత విన్యాస
సంగీత ధోరణుల్ సాగగలవె?...

సంగీత సామ్రాజ్ఞి సరసన గూర్చొండి
శాసింప యికపైన సాధ్యమగునె?
మహిలోని జనులెల్ల మంత్రముగ్ధులు గాగ
మాధుర్య గీతాలు మరవగలరె!...

జరయు మరణమ్ము లేనట్టి శాస్త్రమందు
సహజ సంగీత పాండిత్య శైలితోడ
వేదనాదాలు పలికించి వినుతి బడసి
శంకరపథమ్ము పొందిన సౌమ్యమూర్తి
అందుకొనుమయ్య 'బాలుడా' అంజలులివె!...

**- వనం సుబ్రహ్మణ్యం**
చిన పడుగుపాడు, ఫోన్: 9441594897

**బాలు మాట... బంగారు బాట**

నేను చిత్రపరిశ్రమలో అడుగుపెట్టిన రోజుల్లో సంగీతరంగంలో వెలుగొందుతున్న కళాకారులంతా లబ్దప్రతిష్టులు. అయినప్పటికీ వారంతా ఎందరో ప్రతిభావంతులు. అలాంటి గొప్పవారు నా చిటికెన వేలు పట్టుకుని నన్ను నడిపించడం నా అదృష్టం. వారితో కలిసి పనిచేయ్యడం నా భాగ్యం!..



## ఆ సంగీత నిలయం..

# ఇక వేదనాదాలయం

**వేదపాఠశాల కోసం తమ ఇంటిని కంచికామకోటి పీఠానికి అప్పగించిన బాలు**



ప్రఖ్యాత హరికథా గాన కళాకోవిదుడు, నెల్లూరును మరో తిరువయ్యార్‌గా ప్రసిద్ధిలోనికి తెచ్చి శ్రీ త్యాగ రాజస్వామి ఆరాధనోత్సవాలను ఏళ్ళతరబడి ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించిన త్యాగరాజ భిక్షువు..శ్రీపతి పండితారాధ్యుల సాంబమూరి, ఆయన సతీమణి శకుంతలమ్మ గార్లు జీవనం సాగించిన ఇల్లు..వీరి తనయుడు..ప్రపంచ ప్రఖ్యాత గాయకుడు బాలు ఎంతోకాలం ఇక్కడే నివసించిన ఇల్లు, సింహపురిసీమ లోని సంగీత, సాహిత్య, కళారంగాలకు నిలయంగా ఉన్న ఇల్లు, నెల్లూరు నగరం నడిబొడ్డులో ఉన్న తిప్పరాజువారివీధిలో కోట్లాదిరూపాయలు విలువజేసే ఇల్లు..సంగీత నాదాలకు నిలయంగా ఉన్న శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి గారి ఇల్లు.. ఇక వేదనాదాలతో కూడా పల్లవించనుంది. ఇది నెల్లూరు సీమ అదృష్టం!.. గానగంధర్వుడు బాలు సంగీత నిలయంగా ఉన్న తమ నివాసాన్ని వేదనాదాలయంగా మార్చేందుకు కంచికామకోటి పీఠం వారికి అప్పగించి భారతీయ సనాతన సంస్కృతి పట్ల తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. అది మన బాలు..ఉత్తమ సంస్కారానికి నిలువెత్తు నిదర్శనం!..

గత ఏడాదిన కంచికామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీ విజయేంద్ర సరస్వతి స్వామీజీ వారిని నెల్లూరులోని తమ నివాసానికి సాదరంగా పూర్ణకుంభంతో ఆహ్వానించి, తనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు నివసించిన ఆ ఇంటిని ఒక సంగీతాలయంగా కలకాలం వేదనాదాలతో విరాజిల్లాలని కోరుకుంటూ ఆ ఇంటిని వారికి అప్పగించేందుకు బాలు తీసుకున్న నిర్ణయం సింహపురి సీమలోని ప్రతిఒక్కరి అభినందనలకు పాత్రమైంది. బాలు గారి మాతృమూర్తి శకుంతలమ్మ గారు ఎంతోకాలంగా ఈ ఇంట్లోనే నివాసం ఉంటూ ఇటీవలే కాలం చేయడంతో..తమ కుటుంబసభ్యుల అనుమతితో బాలు తమ ఇంటిని కంచికామకోటి పీఠం వారికి అప్పజెప్పడం ఎంతైనా విశేషం. దీంతో ఇటీవలి వరకు సంగీత సౌరభాలను గుభాళింపజేసిన ఆ ఇల్లు.. త్వరలోనే వేద మంత్రాలతో మరింతగా ఫరిడవిల్లబోతోంది. తండ్రిలోని సద్గుణాలను, తన తల్లిలోని దాన, దయాగుణాలను పుణికిపుచ్చుకున్న బాలు.. తమ ఇంటిని వేదపాఠశాలకు నిలయంగా మార్చి తల్లిదండ్రుల రుణం తీర్చుకుంటున్న బాలు గారు, వారు కుటుంబసభ్యులు ఎంతైనా ధన్యులని వేరే చెప్పనక్కర లేదు.

ఈ కార్యక్రమంలో జగద్గురు కంచికామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీ విజయేంద్ర సరస్వతి స్వామీజీ ఈ సందర్భంగా శ్రీ విజయేంద్ర సరస్వతి స్వామీజీ మాట్లాడుతూ వేదం విశ్వాసంగా, నాదం శ్వాసగా నెల్లూరు ఇకపై వేద నాద నిలయం కానుందని ఆశీర్వదించారు. ఆ తర్వాత బాలు మాట్లాడుతూ భగవత్ సేవకు కంచిపీఠం వారు తమ ఇంటిని స్వీకరించడం సంతోషకరమని, ఇదంతా తమ పూర్వజన్మ సుకృతమని పేర్కొన్నారు. ఈ పాఠశాలకు తమ తల్లిదండ్రుల పేర్లను పెట్టాలని, 'శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి–శకుంతలమ్మల స్మారక సంస్క స్పృత వేదనాద పాఠశాల'గా నామకరణం చేయాలని బాలూ కంచికామకోటి పీఠం వారికి ఈ సందర్భంగా సూచించారు.




# పాటన్నా, స్నేహమన్నా.. ఆయనకు ప్రాణం

**- బాలు గారితో అనుబంధాన్ని గుర్తుచేసుకున్న వీరిశెట్టి హజరత్‌బాబు**

బాలు గారితో నాకు, నా కుటుంబానికి ఉన్న అనుబంధం ఏనాటికీ మరచిపోలేనిది. గత నాలుగు దశాబ్దాలుగా బాలు మాకు మంచి మిత్రుడు అని చెప్పుకోవడానికి ఎంతో గర్వపడుతున్నాను. ఆయనెక్కడున్నా తరచూ నన్ను ఫోన్‌లో పలకరించి యోగక్షేమాలు విచారించేవారు. పాటంటే ఆయనకెంత ప్రాణమో..స్నేహమన్నా కూడా అంతే. మంచి స్నేహానికి ఆయన నిలువెత్తు రూపం. వారి కుటుంబసభ్యులతో మా కుటుంబ సభ్యులేనన్నంతగా మాతో మమేకమయ్యేవారు వారి ఆత్మీయత ఎనలేనిది.

ముఖ్యంగా, మా గాండ్ల కులానికి 'శ్రీపతి పండితారాధ్యుల' కుటుంబం వారు ఎంతోకాలం నుంచి ఆరాధ్యులు. మాకు ఆ కుటుంబం 'గురుపీఠం'. శ్రీపతి పండితారాధ్యుల కుటుంబం వారు అనాదిగా 9 జిల్లాలకు పీఠాధిపతులు. మా కులం వారి కట్టుబాట్లు, నియమాలను శాసించగలిగిన గురువులు వారు. దాదాపు మూడువందల సంవత్సరాలుగా ఈ సంప్రదాయం మాకిలా కొనసాగుతూ వస్తోంది. 1940 ప్రాంతాల్లో మాకు గురుపీఠంగా ఉన్న శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి గారు మాచవరంలో ఉండగా, మా తాతగారైన వీరిశెట్టి సుబ్బారాయుడుగారు వారిని నెల్లూరుకు సాదరంగా తీసుకువచ్చి వారిని ఆరాధ్యులుగా భావించి వారి మాటే వేదవాక్కుగా ఉండేవారు. ఆ తర్వాత మా నాన్న గారు వీరిశెట్టి నాగేశ్వరరావు గారు కూడా గురుదేవులు సాంబమూర్తి గారికి ఆత్మీయ శిష్యునిగా ఉండేవారు. అలా వారి కుటుంబానికి, మా కుటుంబానికి ఎంతో అనుబంధం ఏర్పడింది. ఈ తరంలో మా గురువుగారైన సాంబమూర్తి గారి కుటుంబం తరఫున ఆయన తనయుడు విశ్వవిఖ్యాత గాయకులు శ్రీ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం గారు, మా కుటుంబానికి ఎంతో సన్నిహితులు కావడం మా పూర్వజన్మ సుకృతం. శ్రీ సాంబమూర్తి గారు కాలం చేశాక, నెల్లూరులో ఉన్న బాలు తన మాతృమూర్తి శకుంతలమ్మ అమ్మగారు, సోదరి విజయలక్ష్మి గార్ల బాధ్యతను నాకు అప్పగించడం, నేను అలా మా గురుదేవుని కుటుంబ బాధ్యతలను స్వీకరించి బాధ్యాతాయుతంగా నిర్వరిస్తుండడం జరిగాయి. మా మామగారైన శ్రీ గ్రోసు గోపాలయ్య గారు కూడా బాలు గారికి ఎంతో ఆత్మీయులు. బాలు గారితో ఆయనకు ఎనలేని అనుబంధం ఉండేది. 2001లో నెల్లూరులో మా మామగారు వృద్ధాశ్రమం నిర్వహించాలనుకున్నప్పుడు బాలు గారు ఉచితంగా పాట కచ్చేరీ కూడా నిర్వహించి ఆశ్రమ నిర్మాణానికి తమవంతు సహకారం అందించారు. బాలు గారి మరణం మాకెంతో బాధగా ఉంది. ఆ బాధను ఎలా తెలపాలో మాకు మాటలు రావడం లేదు. మహాగాయకుడు బాలు మృతి నాకు, మా కుటుంబానికే కాదు, మొత్తంగా మా కులం వారికి, అన్నిటికీ మించి సకల గానప్రపంచానికే తీరని లోటు.



ప్రతిభగల వారెందరో ఈ సంగీత సముద్రాన్ని ఈదుతున్నారు. వాళ్ళలో కొందరికి ముత్యాలు దొరకొచ్చు. కొందరికి ఆల్చిప్పలు దొరకొచ్చు. కొందరికి గవ్వలు దొరకొచ్చు. కొందరికి ఏమీ దొరక్కపోవచ్చు. అది వాళ్ళ వాళ్ళ అదృష్టాన్ని బట్టి ఉంటుంది.

బాలు మాట... బంగారు బాట

# పాట అమృతతుల్యం..

(3వ పేజీ తరువాయి)

సంగీతపోటీలు నిర్వహించారు. అందులో సినిమాలకు సంబంధించని పాటలే పాడాలన్నది షరతు. దీంతో బాలు పాల్గొనడం ఒక అదృష్టమనే చెప్పాలి. అందులోనూ తాను స్వయంగా రాసుకున్న కవితకే బాణీ కట్టి తన అద్భుతమైన గాత్రంతో 'రాగములో.. అనురాగములో' అంటూ పాడిన పాట ప్రథమ బహుమతిని అందుకోవడం ఎంత గొప్ప విషయమో కదా! సరిగ్గా ఇక్కడే బాలు జీవితం మలుపు తిరిగింది. ఆ పోటీలకు న్యాయనిర్ణేతలుగా వచ్చిన మధురగాయకుడు ఘంటసాల, ప్రముఖ సినీసంగీత దర్శకులు పెండ్యాల, సుసర్ల దక్షిణామూర్తి, ఆ ముగింపు సభలకు వచ్చిన ప్రఖ్యాత సంగీత దర్శకుడు ఎస్పీ కోదండపాణి బాలును మెచ్చుకోవడం అదృష్టమేనని. ఎస్పి కోదండపాణి గారు నేరుగా వచ్చి బాలు భుజం తట్టి 'బాగా పాడావు. నువ్వు పాడే విధానం బాగుంది. నీతో సినిమాల్లో పాడిస్తాను' అన్నారు. అప్పట్లో ఘంటసాల గారే తమకు పాడాలని అందరు హీరోలు పట్టుబడుతున్న కాలం అది. అందువల్ల బాలుకు అవకాశాలు వస్తాయో రావో తెలియని పరిస్థితి. ఆ తర్వాత కొంత కాలానికి కోదండపాణి గారు అన్న మాటను నిలబెట్టుకున్నారు.

## శ్రీశ్రీశ్రీ మర్యాదరామన్నలో బాలు తొలి పాట



శ్రీ కోదండపాణి గారితో బాలు

బాలు ఏఎంఐఇ రెండవ సంవత్సరంలో అడుగుపెట్టే నాటికి తొలిసారిగా బాలుకి సినిమాల్లో మొదటిసారి పాడే అవకాశం వచ్చింది. ప్రముఖ హాస్యనటుడు నిర్మించిన 'శ్రీశ్రీశ్రీ మర్యాదరామన్న' అనే చిత్రంలో పాడేందుకు ప్రముఖ సంగీత దర్శకుడు కోదండపాణి ఆ అవకాశం కలిగించారు. ఆ చిత్రానికి సంగీత దర్శకత్వం కూడా ఆయనదే. 'ఏమి ఈ వింత మోహం' అనే ఈ పాట 1966 డిసెంబరు 15న మద్రాసులోని విజయా గార్డెన్స్‌లో రికార్డయింది. ఈ పాట పాడేందుకు కారు పంపిస్తామన్న వారు ఇంకా రాకపోవడంతో ఆరోజు బాలు ఎంతో ఉత్కంఠకు గురయ్యారు. అది చూసి ఆయన రూమ్‌మేట్ మురళి బాలుని సైకిల్ మీద విజయా గార్డెన్స్‌కు తీసుకువెళ్ళాడు. అదే సమయానికి కోదండపాణి బయటకు రావడం, బాలును చూసి లోపలికి పిల్చుకుని వెళ్ళి పాటను రిహార్సల్లు చేయించడం జరిగిపోయాయి. ఆ తర్వాత చాలా కాలం బాలుకు అవకాశాలు రాలేదు. ఎంతో మంది సంగీత దర్శకులను కలిశారు. అయినా ఫలితం లేకపోయింది. ఈ దశలో ఆయన ఎంతగా వేదనపడ్డారో ఆ దేవుడికే తెలియాలి. కోదండపాణి గారి దగ్గరే అసిస్టెంట్‌గా పనిచేస్తూ ట్రాక్ సింగర్‌గా ఉంటూనే ఆర్కెస్ట్రా నడుపుతూ..సినిమాల్లో పాడేందుకు ఎన్నో ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. దీంతో పాటు ఒక్క క్షణం కూడా వృధా చేయకుండా తమిళ సినిమాల్లో అవకాశం వస్తాయేమోనని తమిళ భాష కూడా నేర్చుకున్నారు. కష్టించి పని చేసే వాళ్ళకు ఆ భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయనేందుకు నిదర్శనంగా ఆయన కష్టాలు త్వరలోనే ఫలించాయి. 1968లో కోదండపాణి గారే 'సుఖ దు:ఖాలు' సినిమాలో 'మేడంటే మేడ కాదు..గూడంటే గూడు కాదు..పదిలంగా అల్లుకున్న పొదరిల్లు మాది' అనే పాటను పాడించారు. ఇది సూపర్‌హిట్ అయ్యింది. ఇక అక్కడి నుంచీ బాలు వెనుదిరిగి చూడలేదు. తెలుగు చలనచిత్ర రంగంలో బాలు పాటల స్వర్ణయుగం ప్రారంభమైంది. తమిళ చిత్రాల్లోనూ, హిందీ చిత్రాల్లో కూడా మంచి అవకాశాలు వచ్చాయి.

## బాలు పాడిన హిందీపాటకు జాతీయ పురస్కారం

కృషి ఉంటే మనుషులు రుషులవుతారు.. మహాపురుషులవుతారు అన్నానుడి మన బాలుకి అక్షరాలా అతికిపోతుంది. చిత్రపరిశ్రమలో కాలుపెట్టిన దగ్గర నుంచి ఎంతో శ్రమకోర్చి, నిరంతర కృషి, పట్టుదలతో తన గానానికి మెరుగులు దిద్దుకున్నారు. సంగీతరంగంలో మెలకువలు తెలుసుకుంటూ అప్రతిహతంగా తన గానప్రస్థానాన్ని విజయవంతం చేసుకుంటూ ముందుకు సాగారు. ఎల్‌వి ప్రసాద్ బాలును బాలీవుడ్‌కు పరిచయం చేశారు. 'ఏక్ దూజేకేలియే' (ఈ చిత్రం తెలుగులో 'మరోచరిత్ర' పేరుతో వచ్చింది) హిందీ చిత్రంలో బాలు 'తేరే మేరే బీచ్ మే' అనే పాట పాడారు. ఈ పాట కూడా సూపర్‌హిట్టే అయింది. హిందీ చలనచిత్ర రంగంలో బాలు గాత్రం కలకలం రేపింది. ఒక తెలుగు గాయకుడు ఇంత బాగా హిందీలోనూ పాడారా అంటూ చిత్రపరిశ్రమ ఆశ్చర్యపోయింది. అప్పట్లో ఎక్కడ విన్నా ఆ పాట జనం నాలుకలపై నాట్యమాడింది. అంతేకాదు, ఈ పాట బాలుకి జాతీయ పురస్కారాన్ని కూడా తెచ్చిపెట్టడం బాలు గానం జాతీయ స్థాయిలో మార్మోగింది. ఆ తర్వాత 'చాందినీ', 'మైనే ప్యార్‌కియా', 'హమ్ ఆప్‌కే హై కౌన్' వంటి మరిన్ని హిందీ చిత్రాలు బాలు గానమాధుర్యంతో ఓలలాడాయి. ఆయన పాడిన హిందీపాటలు కూడా ఆయనకెంతో మంచి పేరు తెచ్చాయి. ఇంకా అనేకభాషల్లో కూడా ఆయన శృతి పక్వంగా..సుస్వరంతో అత్యద్భుతమైన రీతిలో పాటలు పాడుతుండడంతో బాలు పేరు భారతీయ చలనచిత్ర రంగంలో విశేష ప్రాధాన్యతను సంతరించుకుంది. ఎన్నెన్నో అవార్డులు, ప్రశంసలు, పురస్కారాలు ఆయన్ను వరించాయి. ప్రేక్షకుల్ని, శ్రోతల్ని మంత్రముగ్ధుల్ని చేసే ఆయన గానం..ఆ తర్వాత కాలంలో విశ్వవ్యాప్తమైంది. గానగంధర్వుడిగా కోట్లాదిమంది అభిమానులు బాలును ఆరాధించారు. భారతీయ సినిమా గాయకునిగా..ప్రఖ్యాత సినీ నేపథ్యగాయకునిగా బాలు చిత్రసీమలో రారాజుగా వెలుగొందుతూ వచ్చారు.

## ఎదిగినకొద్దీ ఒదిగే సంస్కారం

బాలు నేపథ్యగాయకునిగా చిత్రపరిశ్రమలో ఎంతగా ఉన్నతస్థానంలో ఉన్నప్పటికీ.. తనకు ఇంతటి స్థాయిని తెచ్చే అవకాశాలు కల్పించిన వారెవరినీ విస్మరించలేదు. ముఖ్యంగా తెలుగు చలన చిత్ర రంగంలో తన గాత్రాన్ని వెలుగులోకి తెచ్చిన మహానుభావుడైన కోదండపాణి గారంటే ఆయనకు ప్రాణం. తన ఉన్నతికి కారణం ఒకే ఒక్క వ్యక్తి అని.. ఆయనే ప్రముఖ సంగీత దర్శకుడు కోదండపాణి గారనీ..ఆయన ప్రతిచోటా ఎంతో వినయ విధేయతలతో చెప్పుకునేవారు. అది..బాలు కృతజ్ఞతాభావానికి తిరుగులేని నిదర్శనం. ఎదిగినకొద్దీ ఒదిగే సంస్కారం. "కోదండపాణిగారనే వ్యక్తే ఆనాడు లేకుంటే ఈనాడు బాలు ఇలా ఉండేవాడు కాదు. ఆయనకు గాయకునిగా నామీద, నా భవిష్యత్తు మీద అపార నమ్మకం. ఆ మహనీయునికి నేనేమిచ్చినా రుణం తీర్చుకోలేను".. అంటూ బాలూ ఎంతో గౌరవభావంతో, కృతజ్ఞతాభావంతో చెప్పుకోవడం బాలు నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం.



'శ్రీశ్రీశ్రీ మర్యాదరామన్న' చిత్రానికి తన తొలి పాట రికార్డింగ్ పూర్తయ్యాక బాలుతో కరచాలనం చేసి అభినందిస్తున్న ఆ చిత్ర నిర్మాత, ప్రముఖ హాస్యనటుడు పద్మనాభం, పక్కన సినీ సంగీత దర్శకుడు కోదండపాణి

### నా ఎదుగుదలకు తొలిమెట్టు...

## గూడూరు 'శ్రీ కాళిదాస కళానికేతన్' - బాలు



గౌస్‌బాషాను ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని అభినందిస్తున్న ఎస్.పి.బాలు

27.5.1963.. ఈ తేదికి చాలా ప్రాముఖ్యత ఉంది. అదేమిటంటే మన గానగంధర్వుడు బాలుగారి సంగీత జీవితాన్ని మలుపుతిప్పిన రోజు. బాలు జీవితంలో మరచిపోలేని రోజు. నెల్లూరుజిల్లా గూడూరులోని శ్రీ కాళిదాస కళానికేతన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గౌస్ బాషా, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రావుల ఆధ్వర్యంలో జరిగిన సంగీతపోటీల్లో బాలు పాల్గొని, అత్యద్భుతంగా గానం చేసి మధురగాయని శ్రీమతి ఎస్.జానకి చేతుల మీదుగా ప్రథమ బహుమతిని అందుకున్న రోజు. ఈ సందర్భంగా బాలు గానం విన్న జానకమ్మ బాలును ఎంతగానో మెచ్చుకుంటూ 'అబ్బాయ్! చాలా బాగా పాడుతున్నావ్. సినిమాల్లో పాడేందుకు ఎందుకు ప్రయత్నించకూడదూ!..అని వేలాదిమంది సంగీతాభిమానుల సమక్షంలోనే సూచించారు. సుప్రసిద్ధ గాయని జానకమ్మ తన పాటను మెచ్చుకోవడంతో బాలు పొంగిపోయాడు. ఆ స్ఫూర్తితోనే సినిమారంగం పట్ల బాలుకు మరింత ఆసక్తి పెరిగింది. అదే ఆ తర్వాత బాలు నేపథ్యగాయకునిగా చిత్రసీమలో రాణించేందుకు దారితీసింది. అనేక సందర్భాల్లో బాలు కూడా ఇదే మాటను చెప్పుకునేవారు. 2009లో నెల్లూరులో జరిగిన ఓ కార్యక్రమంలో కూడా ఆయన అదే మాట చెప్తూ... 'నాకు దొరికిన మొట్టమొదటి వేదిక.. నా ఎదుగుదలకు తొలిమెట్టు గూడూరు శ్రీ కాళిదాస కళానికేతన్' అని బాలు ఎంతో వినమ్రంగా చెప్పుకున్నారు. ప్రత్యేకించి ఈ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడైన గౌస్‌బాషాను ఆయనెంతగానో అభిమానించేవారు. ప్రముఖ సినీగాయని జానకమ్మ గారి ఆశీర్వాదం కూడా తనకు అప్పుడు ఈ వేదికమీదనే లభించిందని చెప్తూ అందరికీ బాలు తన కృతజ్ఞతలు చెప్పుకునేవారు.

# బాలుకు 'భారత రత్న' ఇవ్వాలి

## - ప్రధాని మోడీకి ముఖ్యమంత్రి జగన్ లేఖ



గానగంధర్వుడు, దివంగత ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు దేశంలోని అత్యున్నత పౌర పురస్కారమైన 'భారత రత్న'ను ప్రకటించాలని కేంద్రప్రభుత్వాన్ని కోరుతూ ప్రధాని మోడీకి సెప్టెంబర్ 28వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి లేఖ రాయడంతో బాలు అభిమానుల్లో ఆనందం వెల్లువెత్తింది. లతామంగేష్కర్, భూపేన్ హజారికా, బిస్మిల్లాఖాన్ భీంసేన్ జోషి, ఎంఎస్ సుబ్బులక్ష్మి వంటి గొప్ప గాయకులు, సంగీత విద్వాంసులకు ఎంతో ప్రతిష్టాత్మకమైన 'భారతరత్న' గౌరవాన్ని ఇచ్చినట్లుగానే ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు కూడా ఆ అత్యున్నత పురస్కారాన్ని ప్రకటించాలని, సంగీత సామ్రాజ్యంలో అయిదు దశాబ్దాల పాటు విశేషకృషి చేసిన బాలుకు 'భారత రత్న' ఇవ్వడం ఆయనకు అత్యున్నత స్థాయి గుర్తింపునిచ్చినట్లవుతుందని, ఆయనకదే అత్యున్నత నివాళి అని సిఎం జగన్ ఆ లేఖలో పేర్కొన్నారు.

### బాలు సేవలు నిరుపమానం

బాలు అకాలమరణం దేశంలోని కళాభిమానులనే కాకుండా అంతర్జాతీయంగా ఉన్న సంగీత కుటుంబాన్ని విస్మయానికి గురిచేసింది. ఆయన విజయాల పరంపర అసాధారణమైనది. సాటిలేని గాన ప్రతిభతో బాలు రాణించారు. వివిధ భాషల్లో సుమారు 40వేలకుపైగా పాటలు పాడారు. ఉత్తమ నేపథ్యగాయకునిగా ఆరుసార్లు జాతీయ పురస్కారాలను అందుకున్నారు. ఆంధ్ర ప్రదేశ్‌లో 25 సార్లు నంది అవార్డులను పొందడంతో పాటు, కర్నాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి అనేక పురస్కారాలను అందుకున్నారు. దేశంలోని ఎంతో విశిష్టమైన 'పద్మశ్రీ' అవార్డును 2001లోను, 2011లో 'పద్మభూషణ్' పురస్కారాన్ని అందుకోవడమే కాక 2016లో భారతీయ సినీ దిగ్గజంగా బాలుకు 'వెండి నెమలి' బహుమతిని ప్రదానం చేశారు. బాలసుబ్రహ్మణ్యం చేసిన అసాధారణ సేవలకుగాను బాలుకు 'భారతరత్న' ఇవ్వాలని ముఖ్యమంత్రి జగన్ ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు. ఇది అయిదు దశాబ్దాల పాటు బాలు చేసిన అవిరళ కృషికి దక్కే గొప్ప గుర్తింపుగా ఎప్పటికీ మా జ్ఞాపకాల్లో నిలచిపోతుందని జగన్ పేర్కొన్నారు.

తన పాటతో, తన మధుర గానంతో అంతర్జాతీయ ఖ్యాతినార్జించిన మహా గాయకుడు బాలుకు 'భారతరత్న' పురస్కారం లభించాలని బాలు అభిమానులు కూడా మనసారా కోరుకుంటున్నారు.

**బాలు మాట... బంగారు బాట**

ఆప్యాయతను, ఆత్మీయతను తెలియజేసే 'అమ్మా-నాన్న' అనే అద్భుతమైన తెలుగు పదాలుండగా ఈ జనరేషన్ పిల్లలు మాతృభాషను వదిలేసి మమ్మీ-డాడీ అనడం ఎందుకు?..ఈ విషయంలో ముఖ్యంగా కాన్వెంట్ చదువులు చదువుకునే పిల్లల విషయంలో తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలి.






# చెన్నైలో మీట్ & గ్రీట్

- రెండు అంతర్జాతీయ అవార్డులతో ఆనందం
- బాలసుబ్రహ్మణ్యం అభినందనతో బ్రహ్మానందం

'లాయర్' పత్రిక సంపాదకుడు తుంగా శివప్రభాత్‌రెడ్డిని 2012లో 2 అంతర్జాతీయ అవార్డులు వరించాయి. అమెరికాలో జరిగిన "నాట", "ఆట" ద్వైవార్షిక సభలలో వారం తేడాతో ఈ రెండు అవార్డులను అంతర్జాతీయ వేదికపై ప్రభు అందుకున్నాడు.

"ఎక్సలెంట్ ఇన్ జర్నలిజం అండ్ కమ్యూనిటీ సర్వీస్ అవార్డ్"తో నాట సత్కరించగా "అవుట్ స్టాండింగ్ పెర్ఫార్మన్స్ ఇన్ జర్నలిజం అవార్డ్"తో 'ఆట' సన్మానించింది. పత్రికా రంగంలోనూ, సామాజిక రంగంలోనూ అయన అందించిన సేవలకు గాను ఈ రెండు అవార్డులు ఆయనకు అందించారు.

ఈ సందర్భాన్ని పురస్కరించుకుని మద్రాసులోని తెలుగు సంఘాలు, తెలుగు ప్రముఖులంతా కలసి "మీట్ అండ్ గ్రీట్ ప్రభు" పేరుతో చెన్నైలోని ఆంధ్రా క్లబ్ గోదావరి హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రస్తుత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు గారితో సహా, ఎస్పి బాలసుబ్రహ్మణ్యం, సింగీతం శ్రీనివాసరావు గారు, డాక్టర్ సియంకె రెడ్డి గారు తదితరులు ముఖ్యఅతిధులుగా పాల్గొన్నారు. ఆ కార్యక్రమంలో ప్రార్ధనా గీతం ఎస్పి శైలజమ్మ పాడడం ఒక ఆకర్షణ అయితే ప్రభుతో బాలుగారికి వున్న అనుబంధం గురించి అయన చెప్పిన మాటలు మరపురానివి. తాను వేరొక కార్యక్రమం కోసం ఆ ఉదయమే బెంగుళూరు వెళ్ళవలసి ఉన్నప్పటికీ, సియంకె రెడ్డి గారు ఈ కార్యక్రమం గురించి చెప్పినప్పుడు ప్రభు కోసం తన బెంగుళూరు ప్రయాణాన్ని రాత్రి ఫ్లైట్‌కి మార్చుకున్నానని అయన చెప్పడం ప్రభు కుటుంబంపై ఆయనకున్న మమకారానికి నిదర్శనం.

ఆ కార్యక్రమంలో వెంకయ్యనాయుడిగారితో పాటు ఇతర పెద్దలందరితో కలసి ప్రభుని అయన సత్కరించి అభినందించారు. రెండు అంతర్జాతీయ అవార్డులు ఒకేసారి రావడం ఆనందకరమైతే ఇంతమంది పెద్దలతో పాటు బాలుగారి చేతుల మీదుగా సత్కారం అందుకోవడం బ్రహ్మానందం.

# టౌన్‌హాల్ అంటే పిచ్చి ప్రేమ...

టౌన్‌హాల్(పురమందిరం) అంటే బాలుకి పిచ్చి. అక్కడ తన నాన్న హరికథలు చెప్పేవాడు, పాటల పోటీలు జరిగేవి, ముఖ్యంగా నెఫ్జా సుందరరామిరెడ్డి, సిఫ్కా సుబ్బారావులిద్దరూ పోటీపడి సినిమా వాళ్లను తీసుకొచ్చేవాళ్ళు. ఆ సినిమా వాళ్ళను చూడడానికి తానూ తోసుకుని వెళ్ళేవాడు. అదే టౌన్‌హాల్‌లో ఆయన పోటీలలో పాడాడు, అదే టౌన్‌హాల్‌లో తాను ఎన్నో కార్యక్రమాలలో అతిధిగా పాల్గొన్నాడు, అదే టౌన్‌హాల్‌లో అయన అనేక సన్మానాలు, అవార్డులు అందుకున్నాడు, అన్నింటినీమించి అదే టౌన్‌హాలును ఆయన పునఃప్రారంభించాడు.




టౌన్‌హాలు పునఃప్రారంభోత్సవ శిలాఫలకం

2003వ సంవత్సరంలో ప్రముఖ పారిశ్రామికవేత్త, దాత జె.యస్ రెడ్డి తన తండ్రి జక్కా రంగారెడ్డి స్మారకంగా టౌన్ హాలును భారీ వ్యయంతో ఆధునీకరించి, కొత్తహంగులతో రూపుదిద్దారు. అందంగా అలంకరించుకుని సంగీత, సాహిత్య, సాంస్కృతిక కళారంగాలకు తన సేవలు అందించడానికి సిద్దమైన టౌన్‌హాలును 2003 సెప్టెంబర్ 14న యస్పి బాల సుబ్రహ్మణ్యం ప్రారంభించాడు. అప్పటి నుండి అయన జెయస్ రెడ్డి ఎప్పుడు పిలిచినా టౌన్‌హాల్ కార్యక్రమాలలో పాల్గొనడానికి ఇష్టం చూపించేవాడు. టౌన్‌హాల్ శతాబ్ది వేడుకలకు హాజరయ్యాడు, జక్కా రంగారెడ్డి కళాపరిషత్ ఆధ్వర్యంలో జరిగిన నెల్లూరు నటి కళాభినేత్రి వాణిశ్రీ సత్కార కార్యక్రమానికి కూడా విచ్చేశాడు.




టౌన్‌హాలు శతాబ్ది ఉత్సవాల సందర్భంగా సత్కారం స్వీకరిస్తున్న బాలు



'కళాభినేత్రి' వాణిశ్రీకి జక్కా రంగారెడ్డి స్మారక పురస్కారాన్ని అందజేస్తున్న బాలు

బిక్షాటనా పూర్వక త్యాగరాజ సంస్మరణోత్సవాలకి, తన మిత్రుడు కామేశ్వరరావు మరణించిన తరువాత తన సహకారంతో ఆవిర్భవించిన కామేశ్వరరావు స్మారక కళాపరిషత్ కార్యక్రమాలకి, తన మిత్రులు స్థాపించిన విజేత ఆర్ట్స్ కార్యక్రమాలకు, తాను గౌరవాధ్యక్షుడిగా ఏర్పాటైన నాగ భైరవ కోటేశ్వరరావు అవార్డు కమిటీ కార్యక్రమాలకి, జూన్ 4న జరిగే తన పుట్టినరోజు వేడుకలకి అన్నిటికీ వేదిక టౌన్‌హాలే.

అందుకే బాలుకి టౌన్‌హాల్ అంటే పిచ్చి... కాదు కాదు పిచ్చి ప్రేమ!





## 1997లో 'తుంగా అవార్డు'తో

# లాయర్ సత్కారం

## ఆనాటి నుండి ఆత్మీయ అనుబంధానికి శ్రీకారం

'లాయర్' పత్రిక వ్యవస్థాపకులు తుంగా రాజగోపాలరెడ్డి గారు 1995 జనవరి 18న పరమపదించారు. ఆ తరువాత 1996 నుండి నవంబర్ 8వతేదీ ఆయన జన్మదినాన్ని తుంగా పండుగగా జరుపుకుంటూ ఆయనకు ఇష్టమైన రాజకీయ, కళ, సాహిత్య రంగాల్లో ఒక్కొక్క రంగం నుండి ఒక్కో ప్రతిభావంతుడిని ఎంపిక చేసి "తుంగా అవార్డు"లను అందచేయడం ఆనవాయితీగా పెట్టుకుంది లాయర్.



1996లో జరిగిన తొలి తుంగా పండుగలో ఆ అవార్డును సుప్రసిద్ధ రచయిత, నటుడు గొల్లపూడి మారుతీరావు అందుకోగా, 1997 నవంబర్ 8న జరిగిన రెండవ తుంగా పండుగలో భారతీయ సినిమా గాయకులు ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం 'తుంగా అవార్డు' స్వీకరించారు. బాలును తుంగా అవార్డుతో సత్కరించడంతో ఆ అవార్డుకు ఒక్కసారిగా జాతీయస్థాయి గుర్తింపు లభించినట్లయ్యింది.

నీతి నిజాయితీలే కొలమానాలుగా నిబద్ధతో పనిచేసిన నిఖార్సైన పాత్రికేయుడిగా పేరుగడించిన స్వర్గీయ తుంగా రాజగోపాలరెడ్డి గారి పేరుపై ఏర్పాటు చేసిన "తుంగా అవార్డు" అందుకోవడం తనకు గర్వకారణంగా ఉందని ఆ సందర్భంగా బాలూ అన్నారు. ఆనాటి కార్యక్రమంలో ప్రముఖ వైద్యనిపుణులు డా॥ సి.యం.కె.రెడ్డి, మాజీ శాసనసభ్యులు జె.కె.రెడ్డి, మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఆనం వివేకానందరెడ్డిలు కూడా పాల్గొన్నారు. తుంగా కుటుంబంతో బాలు గారికి ఆనాటి నుండి ఏర్పడ్డ బంధం బలపడి ఆత్మీయ కుటుంబ అనుబంధంగా మారి, 23సంవత్సరాల స్నేహ సంబంధంగా పెనవేసుకుపోయింది.

## బాలుగారితో అనుబంధం

# నా పూర్వజన్మ సుకృతం...



2020, మార్చి 15న ఆయనతో నా చివరి జ్ఞాపకం ఈ స్వీయచిత్రం

మధుర గాయకుడు... ఇప్పుడు అమర గాయకుడయ్యాడంటే నమ్మలేకున్నాను. భారతీయ సినిమా గాయకుడు జ్ఞా(గా)న గంధర్వుడు, నెల్లూరు ముద్దుబిడ్డ శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యంతో నా పరిచయం 23 ఏళ్లనాటిది. ఆ పరిచయం ఆత్మీయ అనుబంధంగా కుటుంబ బంధంగా మారి ఎనిమిదేళ్లయ్యింది. ఆయన సినిమాలో తొలి పాట పాడింది 1966, నేను పుట్టింది అదే 1966. మా ఇద్దరికీ వయసులో అంత తేడా వుంది. కానీ ఆయన ఎప్పుడూ నా పట్ల ఆ వ్యత్యాసం చూపేవాడు కాదు. తన 50సంవత్సరాల సహచర మిత్రులతో ఎలా ఉండేవాడో నాతోనూ అలాగే ఉండేవాడు, అదే సాన్నిహిత్యం, అదే చొరవ, అదే ఆప్యాయత అదే కలుపుగోలుతనం, వారి తండ్రి శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి గారి విగ్రహం నెల్లూరు కస్తూర్భా కళాక్షేత్రంలో ఆవిష్కరింపజేసే బాధ్యత నాపై పెట్టడం, ప్రతి ఏటా వారి పుట్టినరోజు వేడుకను నెల్లూరులో నిర్వహించే అవకాశం నాకు కలిగించడం, ప్రతి వేడుకలోనూ అతిథిగా నాకు సముచిత స్థానం కల్పించడం ఇవన్నీ నా పూర్వ జన్మ సుకృతం కాకపోతే మరేమిటి!

ఆయన స్నేహాన్ని ప్రేమిస్తాడు, స్నేహితులకి ప్రాణమిస్తాడు, "స్నేహమేరా జీవితం... స్నేహమేరా శాశ్వతం" అంటూ... తాను ఎక్కడున్నా, ఏ మాత్రం తీరిక దొరికినా స్నేహితులతోనే గడుపుతాడు. ఒక మహోన్నత గాయకుడిగా, కన్నవారికి కీర్తిని తెచ్చిన బిడ్డగా, ప్రేమను పంచే మంచి భర్తగా, ఆత్మీయానురాగాలు కురిపించే తండ్రిగా, అనురాగాన్ని పంచే సోదరుడుగా, ఆపదలో ఉన్నవారిని ఆదుకునే మానవతామూర్తిగా, యావత్ సినీ సంగీత ప్రపంచం ఆరాధించే దైవంగా అవతరించి తనువు చాలించాడు.

భారతీయ సినీ సంగీత ప్రపంచం ఉనికి ఉన్నంత వరకూ ఆయన చిరంజీవిగానే ఉంటారు, ఆయన గానం అజరామరమై వినిపిస్తూనే ఉంటుంది. ఆయన ఇక లేడని తెలిసి మనసు బరువెక్కింది, గొంతు మూగబోయింది, మాట ఆగిపోయింది. తాను వందేళ్ళు బ్రతకాలని, ఆ సమయంలో తన తల్లి తనతోపాటే ఉండాలని తరచూ ఆకాంక్షిస్తుండిన ఆ మహాగాయకుడు ఏడాదిన్నర క్రితం తల్లిని కోల్పోవడం, ఇప్పుడు హఠాత్తుగా ఆయన కూడా తన తల్లి దగ్గరకే వెళ్లిపోవడం... ఇది విధి వైపరీత్యమే కదా!

ఆ మహాగాయకుడికి, మానవతామూర్తికి, స్నేహాభిలాషికి నా నివాళులర్పిస్తూ... ఆ మహనీయుడికి ఇదే నా అక్షర నివాళి.

- ప్రభు




కీ॥శే॥ యస్.పి. బాలసుబ్రహ్మణ్యం గారు

అశ్రునివాళి

మీ స్వరం భారతీయ సినిమాకి ఓ వరం..
మీ గళం వినిపిస్తూనే వుంటుంది నిరంతరం...

KANCHEEPURAM
VRK
SILKS
#27B/76, నాడు స్ట్రీట్, షేక్‌పేట్, కాంచిపురం.
Ph: 044 27222226

బెజవాడ గోపాల్ రెడ్డి సర్కిల్, మిని బైపాస్‌రోడ్, మాగుంట లే అవుట్, నెల్లూరు. ఫోన్: 2316677


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** e-mail: lawyerpatrika@gmail.com